

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 13 ఫిర్యాదులు



ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలపై 13 ఫిర్యాదులు వచ్చాయి. సివిల్ అంశాలపై 5, ఆస్తి నేరాలపై 4, ఇతరత్రా అంశాలపై 5 ఫిర్యాదులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు.

యుపిఎస్ వద్దే వద్దు

- ఏకీకృత పెన్షన్ రద్దు చేయాలి
- పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి
- యుటిఎఫ్ నాయకుల డిమాండ్
- తాలూకా కేంద్రాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర స్పష్టం చేశారు. యుపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, ఉద్యోగులు శుక్రవారం తాలూకా కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీమ్ అమలు చేస్తున్నాయని చెప్పారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, భిక్ష కాదన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా సిపిఎస్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటాల ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో మాత్రం సిపిఎస్ స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ తెచ్చి సిపిఎస్ కంటే మెరుగైందని నమ్మబలికిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ విధానాన్ని తిరస్కరించారని, మరోరూపంగా ఉన్న యుపిఎస్‌ను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. యుపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని కేంద్రం సూచన చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేని కార్పొరేట్ల షేర్ మార్కెట్ మాత్రమే లాభాన్ని చేకూర్చే యుపిఎస్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ యుపిఎస్ వంటి అంకెల గారడీ చేసే పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నా అనంతరం తహశీల్దార్ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడ్నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఉపాధ్యాయ, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కురుకేళ సురేష్ కుమార్, పి.చిన్నారావు, వైకుంఠరావు, తాతారావు, డి.సంధ్యారాణి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. యుపిఎస్‌ని రద్దు చేయాలని నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ దిలీప్ చక్రవర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కురమాన దాలయ్య, పాలవలస ధర్మారావు, పి.గణపతి, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం ఉప తహశీల్దార్ ఆర్.మధుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సిపిఎస్ జిల్లా కన్వీనర్ గొండు నారాయణరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింహాచలం, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం : తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి వెంకటరమణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడ్డ మోహనరావు, జి.కవీశ్వరరావు, ఎం.శంకరరావు, ఎం.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : యుపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు లండ బాబురావు, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, కూర్మారావు, కంచిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి నాయక్, రవికుమార్, మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జగదీష్ బాదిత్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం తహశీల్దార్ ఎన్.రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ పొందూరు అప్పారావు, మండల అధ్యక్షులు గురుగుబెల్లి గోపాలరావు, జి.మధుబాబు, మురళి, సత్యనారాయణ, మెట్ట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వై.అనంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీను, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.శోభన్‌బాబు, కె.విజయ్ కుమార్, నాయకులు దండు ప్రకాశరావు, బి.స్వర్ణలత, టి.గణపతి, టి.రవి, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు



కోటబొమ్మాళి : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



పాతపట్నం : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



టెక్కలి : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



కొత్తూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు



సోంపేట : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలి
- వన మహోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు



మొక్కను నాటుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, కోటబొమ్మాళి

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలుర కళాశాల ఆవరణలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేటలోనూ ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెట్లను నరికేయడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిందన్నారు. సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 21 శాతం మాత్రమే పచ్చదనం ఉందని మొక్కలు నాటే కార్యక్రమంతో 50 శాతానికి పెంచుకోవాలన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు తదితర కార్యక్రమాలకు మొక్కలు నాటాలన్నారు. ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేసి వాటిని సంరక్షించాలని సూచించారు. తనను కలిసేందుకు వచ్చిన వారు బొకేలు, పూలదండలు కాకుండా మొక్కలు తీసుకురావాలన్నారు. ఉపాధి హామీలో భాగంగా పెద్దఎత్తున పండగ వాతావరణంలో మొక్కలు నాటాలన్నారు. కార్తీక మాసంలో వన మహోత్సవాన్ని ముగించుకుందామన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం హరితాంధ్ర కోసం అడుగేద్దాం.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటుదాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఎఫ్‌ఒ ఎస్.వెంకటేష్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఉద్యానశాఖ ఎడి ప్రసాదరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సబ్ డిఎఫ్‌ఒ నాగేంద్ర, ఎఫ్‌ఆర్‌ఒలు నిహారిక, జగదీష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు హరివరప్రసాద్, టిడిపి నాయకులు వి.విజయలక్ష్మి, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ఇసుక నూతన విధానం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉచిత ఇసుక నూతన విధానం సెప్టెంబరు 11వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో తప్పక పాటించాలన్నారు. ఇసుక విధానంపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఇసుక విధానంపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 18005994599, dmgapsandcomplaints@yahoo.com మెయిల్ అందుబాటులో ఉందని, దీన్ని విస్తృతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆన్‌లైన్ పోర్టల్ , గడువు తేదీలు, మ్యాన్ పవర్, ఏజెన్సీల నియామకం, స్టాక్‌యార్డ్ ఇన్‌ఛార్జీలు, సెక్యూరిటీ పర్సనల్, ఇతర స్టాల్‌ల నియామకం, సిబ్బందికి శిక్షణ, టెండర్ ప్రక్రియ ద్వారా తవ్వకం, లోడింగ్ తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కె.వి సత్యనారాయణ, ఫణిభూషణ్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, నీటిపారుదలశాఖ ఎస్‌ఒ పొన్నాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి - మందస

కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. మందస పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, పలు ముఖ్యమైన కేసు దర్యాప్తు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంబంధమైన కేసులపై దృష్టిసారించి, దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాల తనిఖీలు విస్తృతంగా చేయాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాల స్థావరాలపై నిరంతరం దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో నాటుసారాని నియంత్రించాలన్నారు. రాత్రి గస్తీ విధులు పటిష్టంగా అమలు చేసి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, మహిళలు, వృద్ధులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన సమస్యలని పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వెళ్లబోయే యువకులతో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. దృఢ సంకల్పంతో రాణించి ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎస్.కె ఖాదర్‌బాషా ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ప్రజాశక్తి - కంచిలి

సీజనల్ వ్యాధులపై మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బి.మీనాక్షి సూచించారు. కంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు ఇతర అంశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సాధారణ జ్వరాలే ఉన్నాయని, డెంగీ కేసులు లేవని చెప్పారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఇటీవల కంచిలిలో డెంగీ లక్షణాలతో బాలిక మృతి చెందిందన్నది అవాస్తవమని, డెంగీ లక్షణాల్లేవని స్పష్టం చేశారు. ఆ బాలికకు అందించిన వైద్యంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు. వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 15 రోజులకోసారి ఫీవర్ సర్వే గ్రామాల వారీగా చేపడుతున్నట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారని, మైదాన ప్రాంతాల్లో కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యులు హరిబాబు, నాగేంద్ర, శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి - పలాస, టెక్కలి

తల్లి గర్భంలో పెరుగుతున్న బిడ్డను తెలుసుకొనేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ హెచ్చరించారు. కాశీబుగ్గలో శివదుర్గా ప్రియా ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్కానింగ్ రూమ్‌ను పరిశీలించారు. సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడపాలన్నారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చిన గర్భిణుల వివరాలు నమోదు చేసి రిజిస్టర్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పిసిపిఎన్‌డిటి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యకళ, ఎస్‌ఐ రేవతి, రెవెన్యూ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన్ దొర అన్నారు. పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పిసిపిఎన్‌డిటి అడ్వైజరీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో వైద్యులు ధనలక్ష్మి, స్రవంతి, రాజశేఖర్, ఎస్‌ఐ పి.రఘునాథరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ఐసిడిఎస్, చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు.

మరిన్ని వార్తలకు epaper.prajasakti.com

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. రక్తదానం మహాదానమని, అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాల వేసి బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించారు. వన మహోత్సవం సందర్భంగా బ్లడ్ బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు జిల్లాలో రెడ్‌క్రాస్ చేపడుతున్న పనులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరాలకు తగ్గట్లుగా రక్త నిల్వలు లేవని,రక్త సేకరణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రోజుకు సుమారు 300 యూనిట్లు రక్త నిల్వలు సేకరించాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రక్తదానానికి 18 ఏళ్లు నిండిన యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయొచ్చని చెప్పారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేస్తున్న కళాశాల విద్యార్థినులను అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించిన అవగాహనా ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, డాక్టర్ కె.చిన్నబాబు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నూక సన్యాసి రావు, రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

సంక్షేమం, అభివృద్ధితో ప్రగతిబాట

ఎమ్మెల్యే కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లతో నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 80 రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రెండో విడతలో ఆమదాలవలసలో అన్నా క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలోని డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చిందని, నేడు అదే కళాశాల అభివృద్ధి పనులకు రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. పొందూరు, తొగరాం డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలను త్వరలోనే నిర్మిస్తామన్నారు. గతంలో పొందూరు డిగ్రీ కళాశాలకు స్థలం మంజూరు చేసినా, గత పాలకులు భవనాలను నిర్మించలేకపోయారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి గతంలో తాను ప్రతిపాదించి ప్రారంభించిన పనులు నిలిచిపోయాయని, వాటిని మళ్లీ పట్టాలెక్కించి పరుగులు పెట్టిస్తానన్నారు. నారాయణపురం ఆధునీకరణ, నదుల అనుసంధానం, కరకట్టల నిర్మాణం చిలకపాలెం - రాజాం - రామభద్రపురం, కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం, అలికాం - బత్తిలి రహదారులను నాడు శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో నేషనల్ హైవేకు నాలుగు లైన్ల రహదారులుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపించానని తెలిపారు. గత ఐదేళ్లలో ఆ ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చలేదన్నారు. నేషనల్ హైవేకు ప్రతిపాదించిన ఈ మూడు రహదారులు నాలుగు లైన్ల రహదారులుగా పూర్తయితే పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 96 గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ ద్వారా మంచినీటి కుళాయిలకు నిధులు మంజూరు చేయించానని, నాటి ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం జల జీవన్ మిషన్ పనులు పేరుతో కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. జెన్‌కో ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పరిశ్రమను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోందని, ప్రజలు సహకరిస్తే కార్యరూపం దాల్చుతుందన్నారు. నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక వలసలు పోయే పరిస్థితి ఉందని, పరిశ్రమలను ఆహ్వానిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.



జిల్లా ప్రత్యేకాధికారిగా ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ కార్యక్రమాల అమలు, వాటి పర్యవేక్షణకు జిల్లా ప్రత్యేకాధికారిగా ఐఎఎస్ అధికారి ప్రవీణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం జిఒ నంబరు 1495ను విడుదల చేసింది. 2006 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం గనులు, భూగర్భశాఖ కమిషనర్, డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లీలారాణి

మంత్రి దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో పలు సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకారం మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి తెలిపారు. శుక్రవారం నిమ్మాడలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈమెతో పాటు మోహన్ రెడ్డి, గిన్ని చిన్న ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండలంలోని రావివలసలో శనివారం పర్యటించనున్నారని టిడిపి మండల అధ్యక్షుడు బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఎండల మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం గ్రామ సచివాలయ ప్రారంభం, ప్రభుత్వం అందించే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.


అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

అన్న క్యాంటీన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అశోక్ గుత్తేదారులకు, అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలో జరుగుతున్న అన్న క్యాంటిన్ పనులను శుక్రవారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి పేదలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీరావు, మాజీ కౌన్సిలర్ నాగరాజు, కౌన్సిలర్లు పత్రి తవితయ్య, లీలారాణి, కాళ్ల దిలీప్, నాయకులు కొండా శంకర రెడ్డి, జయదేవ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ఎంబిఎ వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి బిజినెస్ ప్లాన్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా 'ఎఫెక్టివ్ బిజినెస్ ప్లాన్' అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐఐఎం కోల్‌కతా, మేక్ ఇంటెర్న్, ఈ సెల్ సంస్థల శిక్షకులు సుబ్రహ్మణ్యం అయ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని వర్క్‌షాపు ఆవస్యకతపై మాట్లాడారు. ఏ వ్యక్తయితే నేర్చుకోవడం ఆపేస్తాడో.. ఆనాటి నుంచి సంపాదించడం ఆపేసినట్టేనని, ప్రతిరోజూ ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవాలని చెప్పారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి రోజుల్లో వ్యాపారం చేయుటకు ఒక మంచి ఐడియా ఉంటే చాలని, పెట్టుబడుల కోసం కావాల్సిన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలతో పాటు సమాజాన్ని స్టడీ చేయాలన్నారు. మార్కుల కోసం కాకుండా వాణిజ్య వ్యాపార రంగాల్లో మెలకువలు నేర్చుకోడానికి విద్యార్థులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎంబిఎ హెచ్‌డి డాక్టర్ బి.శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చింతామణి పట్నాయక్, ప్రణయ, విద్యార్థులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- టెక్కలి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రానైట్ పరిశ్రమల నుంచి, పాలిష్ పరిశ్రమల నుంచి అదనంగా వసూలు చేసిన 25శాతం పన్నుల బకాయిలను తక్షణమే చెల్లించాలని యూనిట్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక విశ్వసముద్ర కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపు నుంచి నవీన్ చౌదరి మాట్లాడుతూ మైనింగ్ చట్టం అమలు పర్చాలని, మరికొద్ది రోజుల్లో గ్రానైట్ పరిశ్రమలకు పర్మిట్లు మంజూరు చేసే క్రమంలో భాగంగా ముందుగానే తమ సమస్యల్ని పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా వసూలు చేసిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. తనిఖీల పేరుతో తమను, పరిశ్రమలను, కార్మికులను వేధించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల నుంచి, కార్మికుల నుంచి అపరాధ రుసుం పేరుతో లక్షల రూపాయలు వసూలు చేశారని వాటన్నిటికీ విశ్వసముద్ర యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్లాబ్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. హక్కులను కాపాడుతూ గ్రానైట్ ఫ్యాక్టరీలకు రావాల్సిన రాయితీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం విశ్వసముద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి సునీల్, చక్రవర్తులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పాలిషింగ్ పరిశ్రమల యూనిట్ అసోసియేషన్ తరపున నవీన్ చౌదరితో పాటు మహేంద్ర సిగ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సిపిఎస్‌పై నిరసనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సెప్టెంబర్ 1న సిపిఎస్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టి 20 ఏళ్లు అయిన నేపథ్యంలో పాత తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేయాలని ఎపిటిఎఫ్ పిలుపునిచ్చింది. ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్ప మరేది తమకు ఆమోదయోగ్యం కాదనే విధానానికి ఎపిటిఎఫ్ కట్టుబడి ఉందని ఆదివారం 9 గంటలకు కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన సిపిఎస్ ఉద్యోగులు, అలాగే సిపిఎస్‌ను వ్యతిరేకించే ఇతర ఉద్యోగులు, పెన్షనర్లు ఈ సందర్భంగా పెద్దఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య ఒక ప్రకటనలో తెలిపారు. వేరే ప్రాంతాల్లో ఉండే ఉద్యోగులు వారికి దగ్గరలో ఉండే పాత తాలూకా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమంలో హాజరవ్వాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మెళియాపుట్టి : మొక్కలు నాటుతున్న పీడీ చిట్టిరాజు


టెక్కలిరూరల్ : మొక్కలు నాటుతున్న ఆర్‌డిఒ సుదర్శన దొర

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చెట్లను పెంచడం అత్యంత ఆవశ్యమన్నారు. వన సంరక్షణకై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, టి.చంద్రశేఖర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, గౌరీపతి, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎఇలు అప్పలనాయుడు, బి.శ్రీజన, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'వనం-మనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గొద్దు భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, ఎస్ఐ రంజిత్, ఇఒపిఆర్‌డి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ గాంధీ పార్క్, తహశీల్దార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రారంభించారు. అంతకు ముందు 1, 2, 3 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొత్త వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. 4వ వార్డులో కొత్తగా నిర్మిస్తున్న కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్‌చైర్మన్‌లు లాభాల స్వర్ణమణి, భారతీ దివ్య, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, నందిక జాని, పత్రి తావితయ్య, దిలీప్ కుమార్, లీలారాణి, దాసరి రాజు, నిర్మలా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురంలో వనం మనం కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యంలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ ఎన్.హనుమంతరావు, ఎపిఒ రవి, సర్పంచ్, ఎంపిటిసిలు లక్ష్మి, వెంకటరావు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలాస: అటవీ శాఖ, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ బొమ్మ దగ్గర ఎంపిఇపి స్కూల్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్‌డిఒ భరత్ నాయక్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, గురిటి సూర్యనారాయణ, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఎంపిడిఒ రమేష్ నాయుడు, తహశీల్దార్ బి.సత్యం, ఎంఇఒ శ్రీనివాసరావు, కౌన్సిలర్ అంబటి మాధురిఆనంద్, పైల చక్రధర్, అటవీ శాఖ సిబ్బంది, ఉద్యానవనశాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

కవిటి: మండలం రాజపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనం మనం కార్యక్రమంలో భాగంగా జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్ తహశీల్దార్ మురళీ మోహన్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, టిడిపి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సర్పంచ్ పూడి లక్ష్మణరావు మొక్కలు నాటారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో వనం మనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎర్రంనాయుడు పార్క్, పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన దొర మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, తహశీల్దార్ దిలిప్ చక్రవర్తి, ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు, కార్యదర్శి కె.వి.వి.జగన్నాథం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లావేరు: మురపాక కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ జి.కల్యాణి, వైస్‌చైర్మన్ కె.అప్పలరాజు, సిఆర్ఎంటి వి.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ ఎన్ని జోగారావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిటి డివిఎస్ఎన్ మూర్తి, ఎపిఒ రెడ్డి సత్యవతి, ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది రత్నాకర్, రామారావు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన దొర మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, జనసేన నాయకులు కనితి కిరణ్ కుమార్, టిడిపి నాయకులు కోళ్ల లవకుమార్, హనుమంతు రామకృష్ణ, దల్లి ప్రసాద్ రెడ్డి, ప్రీతిష్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కిరణ్మయి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: వనం - మనం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్రలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రామకృష్ణ, నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ప్రతినిధులు తాడేల లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధరావు, బాడాన రాజు, ఉమాదేవి, కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

పొందూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎంపిటిసిలు అనకాపల్లి వాణి, వి.పద్మావతి, బాడాన శేషగిరి, ఎపిఒ శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కలిగాంలో వనం మనం కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆధ్వర్యంలో పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, సర్పంచ్ సనపల కోటీశ్వరరావు, ఎంపిడిఒ పావని, ఎపిఒ ప్రేమలత, టిడిపి నాయకులు రేగేటి కన్నయ్య స్వామి, పడాల వెంకట కృష్ణ, శమ్మాన ఉదయ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మందస: మందస ప్రభుత్వ కార్యాలయాల్లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ తిరుమలరావు మొక్కలు నాటారు. ఫారెస్టు రేంజ్ అధికారి తుంబేస్, డిటి కృష్ణమూర్తి, ఎపిఒ హరికృష్ణ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ పిరియా విజయ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిఇఒ డి.వెంకటేశ్వరరావు, డెప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేయిస్తున్న రవికుమార్


పోలాకి : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి


శ్రీకాకుళం అర్బన్ : మొక్కలు నాటుతున్న పిరియా విజయ

పనిచేసేందుకు అధికారులు భయపడుతున్నారు

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కార్యాలయంలో పనిచేసేందుకు అధికారులు భయపడుతున్నారని, ఇక్కడ పని చేసేందుకు ఏ అధికారి ముందుకు రావడం లేదని దీనికి విజిలెన్స్, ప్రతి పనిపై ఫిర్యాదులు చేయడమే కారణమని, ఫిర్యాదులపై ఒక తీర్మానం చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరిగే ప్రతి అభివృద్ధి పనులపై మున్సిపాలిటీకి చెందిన బుల్లు ప్రదాన్ అనే వ్యక్తి పదేపదే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో అభివృద్ధి నిలిచిపోవడంతో పాటు, కాంట్రాక్టర్‌కు బిల్లులు కావడం లేదని, దీంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు, ఇక్కడ పనిచేయడానికి అధికారులు ముందుకు రావడం లేదని, అందువలన తప్పుడు ఫిర్యాదులను పరిగణలోనికి తీసుకోవద్దని మున్సిపాలిటీలో తీర్మాణం చేశారు. ఈ తీర్మాణం కాపీలను విజిలెన్స్, మున్సిపల్ ఉన్నతా ధికారులకు, పోలీసు ఉన్నతాధికారులకు నోట్ తయారు చేసి పంపించాలని చైర్మన్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు ఆదేశించారు. గతంలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడేవారని, నేడు బుల్లు ప్రధాన్ విజిలెన్స్ ఫిర్యాదులకు భయపడి పనులు చేయడానికి ముందుకు రావడం లేదని, ఒక్క వ్యక్తి వలన అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కౌన్సిలర్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ వార్డుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా ఎలా అభివృద్ధి పనులు చేస్తారని, దానిపై కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ తమ వార్డులో ఒక కాలువ పూడికతీతకు రూ.3 లక్షలు పెట్టారని ఒక్క కాలువకా వార్డు మెత్తానికా అని ప్రశ్నించారు. కౌన్సిలర్ గుజు జోగారావు మాట్లాడుతూ తమ వార్డులో రెండేళ్ల క్రితం కాలువ కోసం రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని ఇంతవరకు పనులు జరగలేదని, దీంతో పాతజాతీయ రహదారి కాలువ నీరు. చేపల చెరువు నీరు మేదరవీధి ఇళ్లలోనికి వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ కాలువ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ బోర బుజ్జి, కౌన్సిలర్లు సనపల సింహాచలం, డిక్కల ఆనంద్, తంగుడు ఆశాలత, పోతనపల్లి ఉమ, బోర చంద్రకళ, శర్వానగీత, సవర సోమేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న బాబూరావు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)


మృతిచెందిన ఆదినారాయణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

మండలం నెమలి నారాయణపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పలాసకు చెందిన గొర్రెల కాపరి కడమట ఆదినారాయణ (54) సమీపంలో ఉన్న తన గొర్రెల మంద వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాశిబుగ్గ సిఐ దాడి మోహనరావు, ఎస్ఐ రేవతి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2న వైఎస్ వర్ధంతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని సెప్టెంబర్ రెండో తేదీన నిర్వహించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో వర్ధంతి కార్యక్రమానికి నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

మండలం భైరిపురం 11 కెవి ఫీడర్‌లో జల్లుపుట్టుగ వద్ద ఎబి స్విచ్ ఏర్పాటు, పాడైన కేబుల్ మార్చే క్రమంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ పి.యోగీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిజి పుట్టుగ, నెలవంక పంచాయతీల పరిధిలో గల గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అంతర్రాష్ట చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పాతపట్నం సిఐ ఎన్.సాయి, ఎస్ఐ బి.లావణ్య, సిబ్బందితో కలిసి శుక్రవారం ఆంధ్రా - ఒడిశా బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు అనునిత్యం తనిఖీ నిర్వహిస్తామని, గంజాయి, మద్యం, నాటుసారా, గుట్కా వంటివి అక్రమంగా రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

'గాయత్రి' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్


మండలంలోని మునసబుపేట గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థిని శిమ్మ అర్చనకు రాష్ట్రస్థాయి కవితల పోటీలో బహుమతి వచ్చినట్టు ప్రిన్సిపాల్ డా. పులఖండం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గిడుగు జయంతిని పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిందని, ప్రముఖ కవి, కథకులు గంటేటి గౌరునాయుడు, స్వామినాయుడు చేతులుమీదుగా బహుమతి అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఐక్యూఎసి మార్తండకృష్ణ, గౌరిశంకర్ అభినందించారు.


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అర్చన


మాట్లాడుతున్న జడ్జి మణి

కేసుల రాజీకి ప్రాధాన్యత

కొత్తూరు: కేసులు రాజీకి ప్రాధాన్యత ఇవ్వాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు, సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని, ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రిమినల్, సివిల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు, మనోవర్తి కేసులు, గృహహింస కేసులు, బ్యాంకు రికవరీ తదితరమైనవి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రీలోక్ అదాలత్ నిర్వహించారు. కొత్తూరు, హిరమండలం, బత్తిలి పోలీసులు, న్యాయవాదులు ఎం.అప్పారావు, గేదెల ఫాల్గుణరావు, సుధాకరరావు, సిహెచ్ రవి, ఆర్.రాజు ఎజిపి సిహెచ్. ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

పిహెచ్‌సిలో సౌకర్యాల కల్పనకు చర్యలు

నందిగాం: మండలం నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. శుక్రవారం నౌగాంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యులు పి.అంజలి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమయ్యే బెడ్లు, చైర్లు, టేబుళ్ల ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అంటు వ్యాధులు ప్రబలడంతో పాటు జ్వరాలు అధికంగా ఉన్నందున వైద్యసిబ్బంది పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందజేయాలని సూచించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు సత్యం, ఎంపిటిసి బాలకృష్ణ, వైద్యశాఖ సిబ్బంది సూర్యనారాయణ, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

పలాస: సెప్టెంబర్ 1న నెల్లూరులో జరుగుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సదస్సును జయప్రదం చేయాలని న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, పౌర హక్కుల సంఘం నాయకులు పత్రి దానేష్ కోరారు. మండలం బొడ్డపాడులో అమరవీరుల స్మారక హాల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరస్వామి, లక్ష్మణ, గంగయ్య, బాలరాజు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పిండి వెంకటరావు, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

మెళియాపుట్టి : మండలంలో గత 20 రోజులుగా ఉపాధిహామీ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారు. ఈ నివేదికను శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు చిట్టిరాజు హాజరయ్యారు. 2023-24లో రూ.26.44 కోట్లకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పింఛన్లుకు సంబంధించి మండలంలో పలువురు పింఛనుదారులు మరణించినప్పటికీ వారి ఖాతాలో పింఛను సొమ్ము జమైనట్లు బృందం గుర్తించారని, ఇటువంటి సొమ్మును రికవరీ చేయాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఇల్లయ్యపురం పంచాయతీలో బాల కార్మికుల ద్వారా పనులు చేస్తున్నట్లు, అలాగే గ్రామాల్లో లేనివారికి కూడా మస్టర్లు వేసినట్టుగా సర్పంచ్ వేదిక దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై విచారణ చేసి తగు చర్య తీసుకుంటామని పీడీ తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాల ద్వారా మొక్కలు నాటే విధంగా చూడాలని వెలుగు ఎపిఎం లలితకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో పాటు నీటి యాజమాన్య సంస్థ హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్, ఎపిడి మురళీకృష్ణ, విజిలెన్స్ అధికారులు, ఎస్ఆర్‌పి రామారావు, డిఆర్‌పిలు, తహశీల్దార్ హనుమంతరావు, ఎంపిడిఒ చంద్రకుమారి, ఎపిఒ రవికుమార్, ఇసి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

'మెడికవర్'లో పీడియాట్రిక్ కార్డియాక్ చికిత్స

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పుట్టుకతో వచ్చే గుండె జబ్బుతో బాధపడుతున్న పిల్లలకు శ్రీకాకుళం లో చికిత్స అందుబాటులో మెడికవర్ హాస్పిటల్స్ పీడియాట్రిక్ కార్డియాలజీ విభాగాన్ని ప్రారంభించారు. అందులో బాగంగా శుక్రవారం తొలి శస్త్రా చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఐదేళ్ల బాబుకు దగ్గు, జలుబుతో పునరావృత శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు రావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతనికి పరీక్షల అనంతరం డక్టస్ ఆర్టెరియోసస్ అని పిలవబడే గుండెలో పెద్ద రంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అతనికి ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా మెడికవర్ ఆసుపత్రికు చెందిన కార్డియాలజీ వైద్యులు సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు కన్సల్టెంట్ అడల్ట్ అండ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అల్లూరి అశోక్‌రాజు కీ హోల్ ఇంటర్వెన్షనల్ విధానం ద్వారా రంధ్రాన్ని మూసివేశారు. బాబు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.


శస్త్రచికిత్స అనంతరం బాబుతో వైద్యులు అన్నాజీరావు, అశోక్‌రాజు

ఆయువు కోసం పోరాటం

చావుబతుకుల్లో వలస కూలీ
దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- కవిటి

పొట్ట కూటి కోసం హైదరాబాద్ వలస వెళ్లిన ఆయనకు ఆ పొట్ట లోపలే పుండు రూపంలో మహమ్మారి కబళించింది. ప్రస్తుతం అది కడుపులో వ్యాపించి ప్రాణాంతకంగా మారింది. దీంతో ఆయన శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో ఆయువు కోసం పోరాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన బదకల అప్పారావు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళ్తే గతంలో చేసిన ఆపరేషన్ వికటించినట్టు తెలిపారు. అంతేకాకుండా జాండీస్ కూడా తీవ్రస్థాయిలో ఉందని చెప్పారు. తక్షణమే ఆపరేషన్ చేయాలని లేదంటే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు చెప్పారు. వైద్యం కోసం సుమారు రూ.3 లక్షలకుపైగా ఖర్చు అవుతుందని చెప్పడంతో తన ఇద్దరు పిల్లలతో అప్పారావు భార్య దుర్గ దిక్కుతోచని స్థితిలో విలపిస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని తమకు ఇప్పుడు దిక్కెవరని, దిక్కులేని తమకు దయగల హృదయాలు ఆదుకోవాలని ప్రాధేయ పడుతోంది. స్పందించే హృదయాలు ఫోన్‌పే నెంబరు 9505153080కు ఆర్థికసాయం అందించాలని కోరుతోంది.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావు


ఆవేదనలో భార్య, పిల్లలు



నియామకపు పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పనిచేసి అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి సాంఘిక భద్రత కింద ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అందులో భాగంగా ఉద్దానం రామకృష్ణాపురం స్కూల్ అసిస్టెంటుగా పని చేసిన వి.శ్రీనివాసరావు భార్య వెంకట విజయలక్ష్మికి ఆఫీసు సబార్డినేట్‌గా గార మండలం అంపోలు హైస్కూల్లో నియమించారు. అలాగే కేశవరావుపేట హైస్కూల్లో స్కూల్ అసిస్టెంటుగా పనిచేసిన బి.భాస్కరరావు కుమారుడు బమ్మిడి చిదంబరేశ్వరరావుకు లావేరులో నియమించారు. ఈ మేరకు నియామకపు ఉత్తర్వులను చైర్‌పర్సన్ పిరియా విజయ అందజేశారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

ఎరువులు అందజేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రాంతంలో రైతులకు ఎరువులు దొరకడం లేదని తక్షణమే రైతులకు ఎరువులు అందించేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ దిలీప్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారులు రేపు, ఎల్లుండి అంటూ రైతులకు తిప్పుతున్నారని, యూరియా కావాలంటే ఇతర మందులు కొనుగోలు చేయాలని లింకు పెడుతున్నారన్నారు. ఎరువులు కొరత సృష్టించి ఇతర నాసిరకం ఎరువులు రైతులతో కొనుగోలు చేయిస్తు అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు ఆర్.బి.కె కేంద్రాల ద్వారా సరఫరా చేయాలన్నారు. అమ్మకాలపై అధికారులు నిరంతర నిఘా ఉండాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావుతో పాటు రైతులు గంగ్రేటి నారాయణరావు, టొంప తవిటయ్య, కైలాస్, గవరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు సిపిఎస్ వ్యతిరేక దినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సెప్టెంబరు ఒకటో తేదీన సిపిఎస్ వ్యతిరేక దినంగా పాటించి పాత తాలూకా కేంద్రాల వద్ద నిరసన చేపట్టాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ పేర్లతో ఉద్యోగులను ప్రభుత్వాలు వంచిస్తున్నాయని, ఉద్యోగుల నుంచి ఎటువంటి కంట్రిబ్యూషన్ వసూలు చేయని పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే ఉద్యోగులు అంగీకరిస్తారని తెలిపారు. కొత్తగా తీసుకు వస్తున్న విదానాల వల్ల కార్పొరేట్లకు మేలు కోసమే తప్ప ఉద్యోగుల ప్రయోజనాలకు ఎంత మాత్రం ఉపయోగ కరం కాదన్నారు. అందువల్ల 1న ఉద్యోగులకు చీకటి దినం గా బావించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

వ్యాధుల నివారణకు చర్యలు శూన్యం

ప్రజాశక్తి- పాతపట్నం



మాట్లాడుతున్న రెడ్డి శాంతి

గ్రామాల్లో పారిశుధ్య లోపించి, ప్రభుత్వ వైఫల్యంతో ప్రజలు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ లేక నీటిని క్లోరినేషన్ చేయడంలో విఫలమవ్వడంతో ఎన్నడూ లేని విధంగా జ్వర బాధితులతో గ్రామాలు వణికి పోతున్నాయన్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అంటురోగాలు, విష జ్వరాలతో అనారోగ్య పీడితులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా, విషజ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులను నియంత్రించి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. జగనన్న హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యరంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో యావత్తు భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్యపథంలో ప్రథమ స్థానంలో నిలబెట్టిన ఘనత జగనన్నకే సాధ్యమైందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్ల ద్వారా ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులను ప్రభుత్వం సేకరించి ప్రతి ఒక్కరికి సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించారన్నారు.

ఆస్పత్రులు నాలుగు.. వైద్యులు ఒకరు

ప్రజాశక్తి- బూర్జ

రెండు జిల్లాలు, నాలుగు మండలాలు. అందులో నాలుగు ఆస్పత్రులకు ఒక్కరే వైద్యులు కావడం విశేషం. బూర్జ మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రికి రెగ్యులర్ వైద్యులుగా కె. మంగమ్మ విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆమె మన్యం జిల్లా సీతంపేట మండలానికి ఆయుర్వేద వైద్యురాలిగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మన్యం జిల్లా వీరఘట్టం మండలం తలవరం, పాలకొండ మండలం భాసురు వైద్యాలయాలకు ఇన్‌ఛార్జిగా మంగమ్మ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బూర్జ మండలంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. రోజు 40 నుంచి 50 మంది వరకు పేషెంట్లు రావడం జరుగుతుందన్నారు. అయితే ఈ ఆస్పత్రిలో ఒక ఎఎన్ఎంతో పాటు ఇద్దరు సహాయకులు ఉండాలని, అయితే ఈ మూడు పోస్టులు ఖాళీగా



బూర్జలో ఆయుర్వేద వైద్య కేంద్రం



వైద్యసేవలందిస్తున్న వైద్యురాలు మంగమ్మ (ఫైల్)

ఉండడంతో ఒకవైపు వైద్యసేవలు అందజేయడంతో పాటు మరోవైపు పేషెంట్లకు మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనివలన కొంత వరకు ఇబ్బందులు ఎదురవు తున్నా యన్నారు. బూర్జలో సోమవారం, బుధ వారం, శుక్రవారం వైద్యసేవలు అంది స్తున్నానని, సీతంపేటలో మంగళవారం, గురువారం, శనివారం వైద్యసేవలు అందజేస్తున్నానని తెలిపారు. అన్ని ప్రాంతాల్లోనూ ఈ వైద్యంపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో సదుపా యాలతో పాటు సిబ్బంది నియమిస్తే విస్తృతంగా వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

చొక్కాకుల బంద సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలోని కాళింగ మన్నయ్యపేటలో ఆక్రమణకు గురైన చొక్కాకుల బంద సమస్యను పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రవికుమార్‌ను రైతులు కలిసి గడచిన కొన్నేళ్ల క్రితం గ్రామంలో సర్వేనెంబర్ 290లో 5.60 ఎకరాల విస్తీర్ణంలో చొక్కాకుల బంద ఉండేదని దానిని గ్రామానికి చెందిన కొంతమంది పెత్తందారులు ఆక్రమించి వారి సాగులోకి తీసుకున్నారని రవికుమార్‌కు వివరించారు. దీంతో చొక్కాకుల బంద దిగువున ఉన్న 80 ఎకరాలకు సాగునీరు అందక పంటలు ఎండి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని ఇటీవల కాలంలో శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన సర్వేయర్ల బృందం సర్వేచేసి హద్దులు నిర్ణయించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు వారిదే బాధ్యత అంటే వారిదేనని ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆయనకు తెలిపారు. చొక్కాకుల బంద నుంచి ఆక్రమణ దారులను ఖాళీ చేయించి రైతులకు సాగునీరు ఇప్పించాలని కోరగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని రైతులకు రవికుమార్ తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో రైతులు కూన సుందరరావు, గురుగుబెల్లి రాజశేఖర్, అన్నెపు కృష్ణకాంత్, గురుగుబెల్లి కృష్ణమూర్తి, పైడి మోహనరావు, పాతిన వెంకట రమణరావు తదితరులు పాల్గొన్నారు.



రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

యుబిఐతో టికెఎం భాగస్వామ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పంద భాగస్వామ్యం చేసుకున్నట్టు టొయోటా కిర్లోస్కర్ మోటర్ సంస్థ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పెద్దపాడు టయోటా మోటార్స్ షోరూమ్‌లో ఎంఒయు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించేందుకు యూనియన్ బ్యాంక్ టికెఎం భాగస్వామ్యం చేసుకుందన్నారు. కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యమన్నారు. వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాలు ఆన్‌రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించ నున్నామన్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద ఏడాదికి 8.80 శాతం నుంచి ప్రారంభమయ్యే ప్రస్తుత వడ్డీ రేట్లతో 84 నెలల వరకు సౌకర్యవంతమైన ఇఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు అన్నారు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా వాహన ఫైనాన్సింగ్ అవకాశాలను పెంపొందించడం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకున్నామన్నారు.

హుండీ ఆదాయం రూ.8.67 లక్షలు



పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధర్మ హుండీని శుక్రవారం ఆలయ అధికారులు సిబ్బందితో లెక్కించారు. గడిచిన 70 రోజులకుగాను రూ.8,67,616 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ టి.వాసుదేవరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమం దేవాదయశాఖ సహాయ కమిషనర్ ఆదేశాలతో టెక్కలి గ్రూపు కార్యనిర్వహణ అధికారి మనస్వి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, వెంకటేశ్వర కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి నిర్వహించారు.

కొనసాగుతున్న విచారణ

కోటబొమ్మాళి: మండలంలోని దంతలో ఇటీవల చోటుచేసుకున్న వికలాంగ బోగస్ పింఛన్లను మూడు రోజులుగా దర్యాప్తు నిర్వహిస్తున్నప్పటికీ ఇంకా 27 మంది లబ్దిదారులు గైర్హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఉపాధిహామి ప్రజావేదికలో దంత గ్రామంలో 72 మంది వికలాంగ పింఛన్లను పొందుతున్నట్లు వెల్లడి కావడంతో అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా దంత సచివాలయంలో డిఆర్‌డిఎ కిరణ్‌కుమార్‌తో పాటు జిల్లా వైద్య బృందం దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఐదు లెప్రసీ ధ్రువపత్రాలపై పింఛన్లు పొందుతున్న వారితో పాటు మరో 27 మంది దర్యాప్తు బృందం ముందు హజరు కాలేదు. చివరికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో దర్యాప్తు నిర్వహించారు.



లెప్రసీ రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇందులో కూడా కేవలం ఐదుగురు లెప్రసీ రోగులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 27 మంది గైర్హాజరయ్యారు. సంబంధిత నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఎడిషినల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. విచారణలో కొత్తపల్లి పిహెచ్‌సి మెడికల్ అధికారి డాక్టర్ వరుణ్, డిపిఎంఒ సురేష్, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఉన్నారు.

బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన



బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్రసన్నరాణి

ప్రజాశక్తి- పొందూరు

బాలికా సంరక్షణ చట్టాలపై ఆడపిల్లలందరూ అవగాహన కలిగి ఉండాలని వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని లోలుగు కెజిబివిలో బాలికా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదవనిద్దాం అనే నినాదంతో పాటు వారి స్వీయ రక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు.

సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎటువంటి కష్టంలో ఉన్నా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆపదలో ఉండే వారిని ఆదుకోవడం సాటి మానవునిగా మనందరి కనీస బాధ్యతని సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు అంబటి దుర్గ అన్నారు. జెమ్స్ ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ శస్త్రచికిత్స చేయించుకున్న శ్రీకాకుళం మండలం సిలగాం సింగువలసకు చెందిన కొర్ను రాజును పరామర్శించారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే రాజు ఆసుపత్రి పాలవడంతో కుటుంబ పోషణ బారమైందని రోదిస్తున్న అతని కుటుంబానికి సమితి సభ్యులు రూ.18వేల ఆర్థికసాయాన్ని అందించి అండగా నిలిచారు.

జెమ్స్ ఆసుపత్రిలో పరామర్శించిన వారిలో ఉర్లం శివతేజ, బరాటం చంద్రశేఖర్, పొడుగు చరణ్ పాల్గొన్నారు.



ధ్వంసం చేసిన శిలాఫలకం

శిలాఫలకం ధ్వంసం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం రావివలసలో సచివాలయం వద్ద మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన సచివాలయం వద్ద నవరత్నాల పట్టిక తెలియజేసే వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటాన్ని, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో గ్రామానికి చెందిన వైసిపి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రం మంత్రి అచ్చెన్నాయుడు శనివారం ప్రారంభిస్తున్న నేపథ్యంలో జగన్ చిత్రపటం ఉండకూడదనే ఉద్దేశంతో టిడిపి వర్గాలే ధ్వంసం చేశారని వైసిపి అభిమానులు ఆరోపిస్తున్నారు. దీనిపై లిఖిత పూర్వకంగా ఎటువంటి ఫిర్యాదులు చేయలేదు.

జిఒలను అమలు చేయాలి



భాస్కరరావు

కోటబొమ్మాళి: గత టిడిపి ప్రభుత్వ హయాంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం విడుదల చేసిన వివిధ ప్రభుత్వ జిఒలను అమలు చేయాలని టెక్కలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సాధికారిక కమిటి కన్వీనర్ పి.భాస్కరరావు సిఎం చంద్రబాబు, వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయులను కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ సమీక్ష సమావేశంలో సిఎం చంద్రబాబు నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలుకు తగ్గకుండా చూడాలని ఆదేశించడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే దేవాలయ పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు తప్పనిసరిగా నియమించాలని మరోసారి అధికారులకు ఆదేశించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా సిఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి తదితరులు

స్థల పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనల మేరకు స్థానిక ఎలక్ట్రికల్ 33, 11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో 132, 33 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శుక్రవారం వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు స్థల పరిశీలన చేశారు. ఈయనతో పాటు ఎలక్ట్రికల్ జెఇ నిరంజన్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ భీమరావు, టిడిపి నాయకులు కొయిలాపు సంజీవరావు, పడాల వెంకట కృష్ణ, ఉదయ్ కుమార్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పెద్ద గురువూరులో గ్రామసభ

నందిగాం: మండలంలోని హర్షబాడ పంచాయతీ పెద్ద గురువూరులో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని ఎంపిడిఒ టి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అర్హుల గుర్తింపు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించారు. ఉపకార వేతనాలు, ప్రసూతి లబ్ధి పథకం, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు గుర్తించిన లబ్ధిదారుల వివరాలతో పాటు నూతనంగా గుర్తించిన వారి వివరాలు ఐటిడిఎకు పంపిస్తామని అధికారులు తెలిపారు. సర్పంచ్ సవర కృష్ణారావు, ఎంపిఎం జాంబవతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ నిర్మాణానికి భూమి పూజ

సోంపేట: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మతో పాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్ బీన ఈశ్వరరావు, షెడ్ నిర్మాణదాతలు దుద్ది శ్రీనివాసరావు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 44 ANNIVERSARY 1981-2024

ప్రత్యేక అనుబంధం

పలాస డివిజన్

శనివారం 31-8-2024 12 పేజీలు



ప్రజల అక్షర ఆయుధం

43 సంవ త్సరాల క్రితం... 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా రూపుదిద్దుకొని తెలుగు పాఠకలోకం ముందుకొచ్చింది. అంచెలంచెలుగా విస్తరించి పది కేంద్రాల నుంచి ప్రచురితమవుతోంది. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలకూ ప్రజాశక్తి వార్తా సేకరణ యంత్రాంగం విస్తరించి, ప్రజా సమస్యలపై అక్షర బాణాలు సంధిస్తూ సమరం చేస్తోంది. పత్రికారంగం భారీ పెట్టుబడులమయమైపోయిన ఈ కాలంలో, ఆ పోటీని తట్టుకొని మున్ముందుకు సాగుతోంది. సుందరయ్య, ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్, బి.టి రణదివే, మోటూరు హనుమంతరావు వంటి మహా నాయకులు నాటిన మొక్కే నేడు శాఖోపశాఖలుగా విస్తరించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం డెస్క్

ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా ఉండాలనేది ప్రజాశక్తి లక్ష్యం. ప్రత్యామ్నాయ జర్నలిజం దాని ఊపిరి. దోపిడీరహిత సమాజ నిర్మాణంలో తన వంతు పాత్ర నిర్వహించడం దాని కర్తవ్యం. శ్రామికవర్గానికి, పీడిత తాడితులకు గళం అది. అభివృద్ధి కాముకులకు, అభ్యుదయవాదులకు కరదీపిక. ప్రజాస్వామ్య పరిరక్షణకు, లౌకిక విలువల పరిరక్షణకు ప్రజాశక్తి ఎప్పుడూ ముందుపీఠిన ఉంటూ వచ్చింది. నియంతృత్వ పోకడలను నిర్భయంగా ఎండగట్టింది. వారపత్రికగా ఉన్న కాలంలో అత్యయిక పరిస్థితికి ఎదురొడ్డి నిల్చింది. దినపత్రికగా పరివర్తన చెంది వేళ్లూనుకుంటున్న కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమైన పరిణామం సంభవించింది. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా రద్దు చేసింది. నాటి కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడను ప్రతిఘటిస్తూ సాగిన ఉద్యమంలో ప్రజాశక్తి తనవంతు పాత్రను నిర్వహించింది. అప్రజాస్వామిక చర్యలను ప్రతిఘటించడంలో ఎప్పుడూ వెన్ను చూపలేదు. ఎమర్జెన్సీలో ప్రజాశక్తి వారపత్రికకు సంపాదకుడిగా ఉన్న మోటూరు హనుమంతరావును అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఎంతో ప్రయత్నించింది నాటి ప్రభుత్వం. ఆయన అజ్ఞాతంలో ఉంటూనే పత్రికను నిర్వహించారు. ప్రపంచీకరణ పేర (మిగతా...2లో)

అభివృద్ధికి నోచుకోని

బారువ కొబ్బరి నారుమడి క్షేత్రం

ఉత్తరాంధ్రలో కొబ్బరి సాగు విస్తరణకు విశేష సేవలందించిన బారువ నారుమడి ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో రూపురేఖలు మారి శిథిల స్థితికి చేరుతోంది. దీనిపై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి- సోంపేట

ఉద్దానం ప్రాంతంలోని రైతులకు మేలు కలిగించేలా, వారి సాగుకు చేయి ఆ దించేందుకు ప్రభుత్వం బారువలో కొబ్బరి నారుమడి క్షేత్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ మొక్కలు తయారు చేయించి, రైతులకు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కొబ్బరి మొక్కల విక్రయంతో ఏటా ప్రభుత్వానికి రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఒక్కో మొక్క తయారీకి రూ.36 వ్యయం అవుతుండగా, రూ.60కు అమ్ముతున్నారు. తిత్లీ తుపాను తరువాత ఇప్పటి వరకు 8 లక్షలకు పైగా మొక్కలు ఇక్కడి నుంచి సరఫరా చేశారు. అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం సహకరించకపోవడంతో నిర్వహణ చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. పనికిరాని మొక్కలు, పొదలు, పరిసరాలు అధ్వానంగా మారడంతో నారుమడి వైపు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత పాలకులు స్పందించి నిధులు మంజూరు చేయడంతో పాటు ఆధునీకరణకు తగిన చర్యలు తీసుకుంటే ఉద్దానం కొబ్బరి రైతులకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని రైతులతో పాటు స్థానికులు కోరుతున్నారు.


కొబ్బరి మొక్కలను తీసుకున్న మహిళా కూలీలు

ప్రస్తుత పరిస్థితి

బారువ తీరంలో ఏర్పాటు చేసిన నారుమడి ఉత్తరాంధ్ర ఉద్యాన రైతులకు అండగా నిలిచింది. కొబ్బరి, జీడి, మామిడి, సపోటా, టేకు, మిరియాలు, సుగంధద్రవ్యాలకు సంబంధించిన నారు తయారు చేసి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సరఫరా చేసేవారు. ఇసుక నేలలు కావడం.. సాగునీరు, ఇతర వసతులు ఉండటంతో ఉద్యాన పంటల నారు తయారీకి ఇక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. తోట పరంగా అదనపు ఆదాయం సమకూరేది. నిర్వహణ పరమైన ఇబ్బందులతో 15 ఏళ్ల పాటు నారుమడి మూతపడింది. రైతుల ఆందోళనలతో 2016లో పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ నిరంతరం పనిచేయడానికి కూలీలు అందుబాటులో ఉంటారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బారువ బీచ్‌కు వచ్చే సందర్శకులకు సేద తీరే కేంద్రంగా ఉపయోగపడేది. తిత్లీలో ప్రహరీ కూలిపోగా పునర్నిర్మించకపోవడంతో సర్పాలకు ఆవాసంలా మారింది. సాగునీటి కోసం ఏర్పాటు చేసిన గుంతలు అధ్వానంగా తయారయ్యాయి. అంతర్గత రహదారులు లేకపోవడంతో రైతులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉద్యాన శాఖాధికారి, సబ్ అసిస్టెంట్, వాచ్‌మెన్ కోసం నిర్మించిన వసతిగృహాలు శిథిలమయ్యాయి. నారుమడి కేంద్రానికి సంబంధించిన కార్యాలయం దెబ్బతిన్నప్పటికీ పునరుద్ధరించలేదు.



విద్యుత్ సౌకర్యం, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. ఉద్యాన పంటలకు సంబంధించిన నారు పెంచేందుకు ఏర్పాటు చేసిన గ్రీన్‌హౌస్ వినియోగించకపోవడంతో నేలమట్టమైంది. ప్రస్తుతం కొబ్బరి మొక్కల ఉత్పత్తికే నారుమడి పరిమితమైంది. మందస మండల ఉద్యాన శాఖాధికారి అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఇతర పోస్టులు భర్తీకి నోచుకోలేదు.


కలుపు తీస్తున్న మహిళా కూలీలు


ట్రాక్టర్‌పై మొక్కలను ఎక్కిస్తున్న మహిళా కూలీలు

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



ప్రహరీ నిర్మాణానికి రూ.34 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇతర అభివృద్ధి పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. బారువ నారుమడిలో విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నాం. ఏటా లక్ష మొక్కలు ఉత్పత్తి చేసేలా జాగ్రత్తలు తీసుకున్నాం.

- రత్నాల వరప్రసాద్,
జిల్లా ఉద్యానశాఖాధికారి

తెలుకుంచిలో

ఫెలికాన్ పక్షుల కిలకిలలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తెలుకుంచిలో ఏటా క్రమం తప్పకుండా వస్తున్న విదేశీ విహంగులు ఈసారీ గ్రామానికి వచ్చాయి. ఫెలికాన్ పక్షుల కిలకిలలతో సందడిగా మారింది. ఈ పక్షులు రాకతో గ్రామానికి ఎంతో మేలు చేస్తాయని భావిస్తారు. దశాబ్దాలుగా ఏటా జూలై, ఆగస్టు నెలల్లో క్రమం తప్పకుండా వస్తాయి. ఈ పక్షుల రక్షణ కోసం గ్రామస్తులు ఎంతో శ్రద్ధగా భద్రత కల్పిస్తారు. వేటగాళ్ల నుంచి రక్షణ గ్రామస్తులే కల్పిస్తున్నారు. కొత్తగా వచ్చిన ఈ పక్షులు జోలికి ఎవ్వరు రాకుండా గ్రామం గట్టి కట్టుబాట్లు ఏర్పాటు చేసింది. దీంతో సమీప గ్రామస్తులు కూడా ఇక్కడ విడిది చేస్తున్న విదేశ పక్షులు జోలికి రారు. గ్రామంలోని చెట్లపై గుడులు కట్టుకొని సంతానం ఉత్పత్తి చేసుకొని డిసెంబరు నెల నాటికి తిరిగి వెళ్లిపోతాయి. చెట్లపై గుడులు ఇటీవల వీచిన పెద్దా గాలివాన్లకు కుప్పకూలి పిల్ల పక్షులు రక్షణ లేకుండాపోయింది. అటవీ శాఖ ఉన్నతాధికారులు ఏటా రావడం పక్షులతో ఫొటోస్ తీసుకోవడం గ్రామస్తులతో మాట్లాడి తిరిగి వెళ్లిపోతారు కానీ, గ్రామానికి వస్తున్న విదేశ వలస పక్షులు రక్షణకు గట్టి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తుంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే అశోక్ చొరవతో రక్షణ వలలు ఏర్పాటు చేశారు. ఆ వలలు చిన్నవి కావడంతో అనుకుంత ప్రయోజనం లేకుండాపోయింది. ప్రభుత్వ పరంగా పక్షుల రక్షణ కోసం చర్యలు తీసుకోకపోయిన గ్రామస్తులు మాత్రం ఈ పక్షులు రాకను ఎంతో మేలు చేస్తాయని భావిస్తారు. పంటలు సుభిక్షంగా పండుతుందని గట్టి నమ్మకం పెట్టుకున్నారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని పాలకులు హామీలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం జరగడం లేదు. ఈ సారి రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సందడి చేస్తున్న ఫెలికాన్ పక్షులు

ప్రజల అక్షర ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

సాగుతున్న దారిద్రీకరణ విధానాలను ఎండగట్టడంలో ప్రజాశక్తిది ఎప్పుడూ ముందంజే.

దోపిడీ విధానాలపై అక్షర ధ్వజం

ప్రపంచబ్యాంకు విధానాల పర్యవసానాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తెస్తోంది. విద్య, వైద్యం, విద్యుత్, నీటిపారుదల ఇలా ప్రతి రంగంలోనూ ప్రపంచబ్యాంకు ప్రవచిత విధానాలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమితాసక్తి చూపెట్టాయి. ఈ విధానాల వల్ల అన్ని రంగాల్లోనూ ప్రజలపై భారాలు పెరిగాయి. ప్రయివేటీకరణ ఫలితంగా విద్యా, వైద్యాలు వ్యాపార సరుకులయ్యాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు లబ్ధిదారులకు ఎలా ఉపయోగపడ్డాయనేది వివరంగా వివరించింది. అందులోని లోపాలనూ అంతే ఎండగట్టింది. విద్యుత్ రంగంలోనూ ప్రయివేటీకరణ... ప్రజలపై భారాలను ఇప్పటికే పెంచింది. మున్ముందు మరింత పెరగనుంది. భారాలు పెంచడమే కాదు, ప్రజల ఉపాధినీ హరించేలా పాలకుల విధానాలు సాగుతున్నాయి. కోస్టల్ కారిడార్‌లో పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్ల పేర ప్రయివేట్ కంపెనీలకు భూ కేటాయింపులు జనం గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తోంది. ప్రయివేట్ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అడవులనూ వదలడం లేదు. గిరిపుత్రులపై నిర్దయగా విరుచుకుపడుతున్నారు. గనుల పేర, సెజ్‌ల పేర భారీగా వందలు, వేల ఎకరాల భూములను ప్రయివేటు కంపెనీలకు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ చర్యలపై వ్యక్తమవుతున్న వ్యతిరేకతను తెలియజేయడంతో సరిపెట్టుకోక ఇలాంటి చర్యలకు ప్రభుత్వాలు ఎందుకోసం తలబడుతున్నాయో ప్రజాశక్తి తెలియచేస్తోంది. రైతులు, కార్మికులు, సేవారంగాల్లోని ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించడంలో, అవుట్‌సోర్సింగ్ పేర ప్రయివేటు కంపెనీలకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్న తీరును ఎండగట్టడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుంది. తన పిల్లల్ని తానే తినేసే పాములా ప్రభుత్వరంగ సంస్థలను పాలకులు మింగేస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటాలకు బాసటగా నిలుస్తోంది ప్రజాశక్తి. భూ సమస్యపై, ఇళ్ల స్థలాల కోసం పేదలు సాగించిన పోరాటాలకు అండగా నిలిచింది ప్రజాశక్తి. పంచగలిగిన, పట్టాలివ్వగలిగిన భూములు ఇక్కడ ఉన్నాయి చూడండి అంటూ జిల్లాల వారీ చూపెట్టింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జరిగిన అక్రమాలను సోదాహరణంగా ఎండగట్టింది. ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బతీసే చర్యలను బయటపెట్టింది. వలసలు, ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై ప్రత్యక్ష పరిశీలన జరిపి వాస్తవాలను పాఠకుల దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రపంచ దేశాల్లో ఆర్థిక రాజకీయ రంగాల్లో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పాఠకుల దృష్టికి తెస్తోంది. స్థానిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఇతర ప్రాంతాల్లో జరిగే ముఖ్యమైన అంశాలనూ వదిలివేసే విధానాన్ని ప్రజాశక్తి అనుసరించడం లేదు. ఇతర రాష్ట్రాల్లోని ముఖ్యమైన వార్తలనూ పాఠకులకు అందిస్తోంది.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ...

ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనవంతు పాత్ర పోషిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు, కేరళ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజాశక్తి సిబ్బంది ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ప్రజలకు సాయపడ్డారు. గడప గడపకూ తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి, ప్రజాశక్తి వార్షికోత్సవాల సందర్భంగా ప్రజాశక్తి ఆధ్వర్యాన రక్తదాన రక్తదాన శిబిరాలు, మండు వేసవిలో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు సబ్జెక్టు నిపుణులతో సదస్సులు... తదితర వాటిని నిర్వహించడం ప్రజాశక్తికి ఒక ప్రత్యేకత. వైద్య శిబిరాల నిర్వహణ కూడా ప్రజాశక్తి సేవా కార్యకలాపాల్లో ఒకటి.

లౌకిక విలువల పరిరక్షణలో...

లౌకిక విలువల పరిరక్షణ కోసం ప్రజాశక్తి సదా నిలబడింది. వ్యాసాలు, సంపాదకీయాలు, ప్రత్యేక సంచికల ద్వారా మతోన్మాదుల చర్యలను బహిర్గతం చేసింది. గుజరాత్‌లోనూ ఇతర రాష్ట్రాల్లోనూ మతోన్మాదులు సాగించిన మారణకాండ, దాని వెనక ఉన్న రాజకీయ లక్ష్యాలను వెల్లడించింది. గుజరాత్‌లో మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగిన నరమేధంపై కోర్టుల్లోనూ వెలుపలా పోరాటం చేస్తున్న ప్రముఖ సంఘసేవకురాలు, జర్నలిస్టు తీస్తా సెతల్వాద్‌ను రజతోత్సవాల ముగింపు సభకు ఆహ్వానించి ఆమె సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించింది. ప్రజాశక్తి 15వ వార్షికోత్సవానికి ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కాగా, 20వ వార్షికోత్సవంలో ప్రముఖ కవి హిందీ సినీ రచయిత జావేద్ అక్తర్ పాల్గొన్నారు. రజతోత్సవాలకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు.

సామాజిక న్యాయం కోసం...

సామాజిక న్యాయంపై కూడా ప్రజాశక్తి విశిష్ట పాత్రను నిర్వహిస్తూ వస్తోంది. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పడడానికి చాలా ముందే ప్రజాశక్తి రాష్ట్రవ్యాప్తంగా దళితులపై కొనసాగుతున్న వివక్ష... ప్రత్యక్షంగా, పరోక్షంగా కన్పించే అంటరానితనంపై సమగ్ర సర్వే నిర్వహించింది. సవివరమైన కథనాలను ప్రచురించింది. పున్నయ్య కమిషన్ ఏర్పడిన అనంతరం, తాను ప్రచురించిన వార్తల క్లిప్పింగ్‌లను కమిషన్‌కు సమర్పించింది. ప్రజాశక్తిలో వెల్లడించిన వాస్తవ పరిస్థితులను పున్నయ్య కమిషన్ అందచేసిన నివేదిక కూడా నిర్ధారించింది. పలు వృత్తులకు చెందిన వారిపై, మైనార్టీల స్థితిగతులపై ప్రజాశక్తి సమగ్ర సర్వేలు జరిపి వాస్తవాలను పాఠకుల ముందుంచింది. సామాజిక న్యాయంపై జిల్లా అనుబంధంలో ప్రతి వారం ఒక పేజీని కేటాయిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజాశక్తి మాత్రమే. అణగారిన వర్గాలపై ఎక్కడ దాడి జరిగినా అక్కడ వాలిపోయి నిజానిజాలను వెలికితీసి ప్రజల ముందుంచుతోంది ప్రజాశక్తి.

మోటూరు హనుమంతరావు మృతి అనంతరం వి.శ్రీనివాసరావు, ఎస్.వినయ్ కుమార్, తెలకపల్లి రవి, పాటూరి రామయ్య, ఎం.వి.ఎస్ శర్మ సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బి.తులసీదాస్ సంపాదకునిగా ఉన్నారు. ప్రజాశక్తి వార పత్రిక కాలం నుంచి వి.ఆర్ బొమ్మారెడ్డి కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. కొరటాల సత్యనారాయణ తన చివరి శ్వాస వరకూ ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పలు విభాగాల్లో పనిచేస్తూ తమ జీవితాలను ప్రజాశక్తికి అంకితం చేసిన కామ్రేడ్స్ ఎందరో ఉన్నారు. వారందరూ స్ఫూర్తి ప్రదాతలు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే లక్ష్యంతో ప్రజాశక్తి ముందుకు సాగుతోంది.

‘జీడి’కి మద్దతు ధర లభించేనా?

- గణనీయంగా తగ్గిన దిగుబడి
- 80 కేజీల బస్తా రూ.12 వేలు
- ప్రభుత్వ హామీపై ఎదురుచూపు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గడిచిన ఐదేళ్లుగా జీడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. దిగుబడి వస్తే గిట్టుబాటు ధర లేకపోవడం, ధర అంతో ఇంతో పెరిగిదంటే దిగుబడి తగ్గిపోవడం, విదేశీ పిక్కల దిగుమతి వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. ఏటా జీడి పిక్కలు దిగుబడి సమయానికి రైతులకు మోసం చేసి అటు దళారులు మరోవైపు వ్యాపారులు లబ్ధిపొందుతున్నారే తప్ప రైతులకు మేలు జరగడం లేదు.

ఈ ఏడాది జీడి పంట గణనీయంగా తగ్గి పోగా గతేడాది కన్నా జీడి పిక్కల బస్తాకు రూ.12 వేలు ధర పెరిగింది. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

విదేశీ పిక్కల దిగుమతితో కష్టాలు

విదేశీ పిక్కల దిగుమతితో స్థానిక జీడి రైతులకు కష్టాలు ఎదురువుతున్నాయి. ఉద్దానంలో పండిన జీడి పిక్కలకు గిరాకీ ఎక్కువ. ఇక్కడ పండిన పిక్కలు రుచిగా ఉంటాయి. వీటిని ఆశరాగా తీసుకొని జీడి వ్యాపారులు ఉద్దాన పిక్కలను కొనుగోలు చేసి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసిన పిక్కలను కలుపుతుంటారు. అయితే గతేడాది ధర మాత్రం బస్తా రూ. 7 వేలుకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది బస్తా రూ.11 నుంచి 12 వేలు ధర పెరిగినప్పటికీ దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వైసిపి ప్రభుత్వంలో జీడి రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జీడి రైతులను ఆదుకోవడానికి, ప్రభుత్వం నుంచి వెయ్యి రూపాయలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ నేరవేర్చాలేకపోయారు. జీడి రైతులు సమస్య పరిష్కారానికి సిఎంఒ స్థాయిలో ఉద్దానం రైతులతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఏడాది ధర పెరిగిందని ఆనంద పడాలో దిగుబడి తగ్గిందని బాదపడాలో అంటూ రైతులు వాపోతున్నారు.

తగ్గిన జీడి దిగుబడి

తిత్లీ తుపాను నుంచి జీడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. తిత్లీ తుపానులో వేల ఎకరాల్లో జీడి తోటలు నాశనం కాగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు జీడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఎకరాకు సుమారు 3 నుంచి 4 బస్తాలు దిగుబడి రావాల్సి ఉంది. ఈ ఏడాది మెట్టు ప్రాంతాల్లో బస్తా, ఇసుక నేలల్లో రెండు బస్తాలు దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. గతేడాది ఎకరాకు సుమారు ఆరు బస్తాలు దిగుబడి రాగా, ఈ ఏడాది పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు వర్షాలు కురవకపోగా, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంవల్లే జీడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు సుమారు రూ.30 వేలు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీడి పిక్కల కొనుగోలు రైతులు ఆశించిన ధరలకు జరిగేనా అన్నది ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది. 80 కిలోల పీక్కల బస్తాకు రూ.16 మద్దతు ధర చెల్లించి కొనుగోళ్లు జరపాలని రైతు సంఘాలు చేస్తున్న పోరాటాలు ఎన్నటికీ పలిస్తయోనని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు కొత్త ప్రభుత్వం ఎంతవరకు మేలు చేస్తుందో వేచిచూసే పరిస్థితి.



విదేశీ జీడి పిక్కలను ఎండబెడుతున్న కూలీలు

జీడి బోర్డు ఏర్పాటు చేసేనా?

టిడిపి అధికారంలోకి వచ్చాక జీడి రైతులను ఆదుకుంటాం, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అయితే చంద్రబాబు నాయుడు చేసిన హామీలు కోసం జీడి రైతులు ఎదురుచూస్తున్నారు. పండిన జీడి పిక్కలకు ధర వస్తుందని ఇంటి వద్ద ఉంచాలో వ్యాపారులకు విక్రయించాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికే పలాస మండలంలోని కొంత మంది రైతులు బస్తా రూ.12 వేలుకు విక్రయిస్తుండగా, వజ్రపుకొత్తూరు, మందస మండలాల రైతులు పిక్కలను అమ్మకుండా ఇంటి వద్ద నిల్వ చేస్తున్నారు. జీడి పిక్కల విక్రయం సీజన్ మొదలు కావడం, మరోవైపు ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు ఏమి చేయాలో తోచక రైతులు ఆలోచనలో పడ్డారు. మరోవైపు దళారులు జీడి రైతులకు మబ్బిపెట్టి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనపటికీ టిడిపి ప్రభుత్వం జీడి రైతుకు ఇచ్చిన హామీను నెరవేర్చుతుందా? జీడి రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందా అని వేచి చూడాలి.

జిల్లాలో 46,744 ఎకరాల్లో జీడి సాగు

ఉద్దాన ప్రాంతం అంటే ముందుగా గుర్తొచ్చేది జీడి పంట వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, కంచిలి, పలాస, ఇచ్ఛాపురం మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 46,744 ఎకరాల్లో జీడి రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు నాలుగు బస్తాలు దిగుబడి వస్తుతుందని ఉద్యానవనశాఖ అధికారులు, రైతులు చెబుతున్నారు. ఆ లెక్కన 2 లక్షలు బస్తాలు (200 టన్నులు) దిగుబడి రావాలి ఉంది. కానీ, ఈ ఏడాది ఎకరాకు సుమారు రెండు బస్తాలు దిగుబడి రావడంతో లక్షల బస్తాలు (వంద టన్నులు) దిగుబడి వచ్చిందని అధికారులు లెక్కలు చెబుతున్నాయి. కానీ, ఆ స్థాయిలో దిగుబడి రాలేదని రైతులు చెబుతున్నారు.

సర్కారు భవనాలు శిథిలం



శిథిలావస్థలోఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో భాగంగా ప్రజలకు సేవలు అందించేందుకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తమ విధులు నిర్వహించేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. తిత్లీ తుపాను సమయంలో మండల సమావేశ మందిరం పైకప్పు ఎగిరిపోయింది. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీలింగ్ పూర్తిగా నాశినమైంది. నూతన భవనం నిర్మించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలాన్ని ఎల్ఐసి సంస్థకు అమ్మకం చేపట్టారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేస్తామని అనుకున్న సమయంలో నిధులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోయాయి. దీంతో భవన నిర్మాణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిస్తే కార్యాలయంలో చాలా ప్రాంతాల్లో కారిపోతుందని అధికారులు,

భయాందోళనలో అధికారులు

ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయశాఖ కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో అధికారులు భయపడుతున్నారు. ప్రస్తుతం భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయంతో పాటు సచివాలయం ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే పలాస ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీరాజ్ అధికారులు పక్కన ఉన్న డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కార్యాలయానికి సమీపంలో ఉన్న పాత ఇఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్ పిచ్చులూడడంతో బయటకు దర్శనమిస్తున్నాయి. శాబ్ పిచ్చులు పడుతుండడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అధికారులు భయాందోళన చెందుతున్నారు. పాత భవనాలకు సమయం మించిపోయినా పాలకులు, అధికారులు నూతన భవనాలు మంజూరు చేయకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనప్పటికీ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులకు పక్కా భవనాలు నిర్మించడంలో పాలకులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే చెప్పాలి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపి పాడైన భవనాలకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా నూతన భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడును వివరణ కోరగా, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం వాస్తవమేనని అన్నారు. నూతన భవనాలు మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రభుత్వం భవనాలు మంజూరు చేసిన వెంటనే పనులు చేపడతామన్నారు.





శిథిలావస్థలో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం



రూ.20 కోట్లతో

అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్‌గా పదవి చేపట్టి మూడున్నరేళ్లలో 31 వార్డుల్లో రూ.20 కోట్ల వ్యయంతో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంజూరు చేసిన రూ.42 లక్షలు, మున్సిపల్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో 31 వార్డుల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించే పనులు ముమ్మరంగా (మిగతా 5వ పేజీలో)

'పైడిగాం ఛానల్'కు నిర్లక్ష్య శాపం

- నిధుల్లేక నిలిచిన పనులు
- ఆయకట్టు రైతులకు తప్పని కడగండ్లు



పైడిగాం ప్రాజెక్టు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని రైతులకు ప్రధాన సాగునీటి వనరైన పైడిగాం ఛానల్‌కు పాలకుల నిర్లక్ష్యంగా శాపంగా మారింది. సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు కాక పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. సరైన వర్షాలు లేక రైతులు పంటలు వేసుకోలేని ప్రస్తుత నేపథ్యంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఉంటే శివారు భూములకు సైతం సాగునీరు అందు ఉండేదని రైతులు చెబుతున్నారు.

మండలంలోని మహేంద్ర తనయ నదిపై మాల గోవిందపురం పంచాయతీ పరిధిలోగల బాతుపురం-కొత్తబాతుపురం గ్రామాల మధ్య పైడిగం ప్రాజెక్టును 1963లో నిర్మించారు. 185 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నెలకొల్పిన ఈ ప్రాజెక్టుపై సోంపేట, కంచిలి, మందస మండలాలకు చెందిన సుమారు 34 పంచాయితీల రైతులు సాగునీటి కోసం ఆధారపడుతుంటారు. ప్రారంభంలో పదివేల ఎకరాలకు పైగా సాగునీటినందించిన ఈ ప్రాజెక్టు 1985లో ఒడిశా రాష్ట్ర పరిధిలోని పూరియా సాయి వద్ద డ్యామ్ నిర్మాణంతో నీటి నిల్వలు లేక మూలకు చేరింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు 80 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. ఇదీ కేవలం వరద నీరు మాత్రమే. మిగిలిన కాలాల్లో ప్రాజెక్టులో చుక్క నీరు ఉండని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఛానల్ పరుపు పూర్తిగా ధ్వంసం కావడమే కాకుండా ఛానల్‌కు చెందిన కాలువలు పూడికలు నిండి, మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వచ్చే కాస్త నీరూ శివారు భూములకు చేరని పరిస్థితి ఉంది. దీంతో ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన రైతులు తీవ్ర ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు స్పందించి ప్రాజెక్టు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని

మూడు మండలాల ఇదే ప్రధాన సాగునీటి వనరు

సోంపేట, కంచిలి, మందస మండలా ల్లోని 34 పంచాయతీల్లో రైతులకు ఈ పైడిగా ఛానలే ప్రధాన సాగునీటి వనరుగా ఉంది. సోంపేట మండలంలోని హంసమోరా, సుంకిడి, భూశాభద్ర, మాకన్నపురం, పొత్ర కండ, బేసిరామచంద్రపురం, కొర్లాం, పలాస పురం, సోంపేట, జింకిపద్ర పంచాయతీల పరిధిలో రైతులు ఈ ప్రాజెక్టుపై ఆధారపడి భూములు సాగు చేస్తున్నారు. అలాగే కంచిలి మండలంలోని శాసనం, జి.నారాయణపురం, చొట్రాయిపురం, గోకర్ణపురం, ఉప్పరపేట, పోతిగుడ్డు, మధుపురం, బూరగాముల్లో రైతులు దీనిపై ఆధారపడ్డారు. మందస మండలంలోని మందస పొత్తంగి గ్రామాల పరిధిలో వందలాది రైతులు ఈ నీటిపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు.

అరకొర నిధుల మంజూరు

పదివేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుపై మొదటి నుంచి పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు మరమ్మతుల కోసం 1999-2000లో రూ.1.35 కోట్లు మంజూరు చేశారు. తర్వాత 2014-15లో రూ.9.75 కోట్లు మంజూరు జరిగింది. ఈ నిధులతో ఛానల్‌కి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మాణం చేశారు. అయితే నిధుల లేమితో అవి పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. తిత్లీ సమయంలో వచ్చిన వరదకు ఈ గోడలు సైతం పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో ప్రాజెక్టులో చుక్క నీరు నిలవని దుష్టతి నెలకొంది.



మరమ్మతులకు గురైన కాలువ గట్టు



పూర్తయిన అరకభద్ర వంతెన

ప్రారంభానికి సిద్ధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని అరకభద్ర-కాళిగాం గ్రామాలను అనుసంధానం చేసేందుకు బాహుదా నదిపై వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తయి చివరి దశకు చేరుకుంది. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమవుతుంది. బాహుదా నదిపై వంతెన లేకపోవడంతో సుమారు 30 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వంతెన పనులు పూర్తి కాకపోవడంతో రెండు కిలో మీటర్ల దూరానికి సుమారు 24 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. అరకభద్ర వద్ద ఐదేళ్ల కిందట టిడిపి ప్రభుత్వం రూ.7.15 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించింది. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం 2022 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించింది. 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగవంతం కాకపోవడంతో ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంతే బాహుదా నది దాటి వెళ్లాలి. నదిలోకి వరద నీరు వస్తే పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నత్తనడక సాగింది. ఒడిశాలో భారీగా వర్షాలు కురిస్తే ఈ ప్రాంతానికి వరద నీరు పోటెత్తుతుంది. నదిలో తక్కువ నీరు ఉంటే అరకభద్ర నుంచి కాళిగాం, ఇతర ప్రాంతాలకు విద్యార్థులు, ప్రజలు నడుచుకుని వెళ్లేవారు. ఈ వంతెన పూర్తి అయితే ముప్పయి గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మొత్తం మీద వంతెన నిర్మాణం పూర్తి చేయడంతో త్వరలో ప్రారంభానికి సిద్ధం అవుతుంది.



అప్రోచ్ రోడ్డు

కొబ్బరిని చుట్టుముడుతున్న 'గానోడెర్మా'

ఖాళీ అవుతున్న తోటలు

ఉద్దానం కొబ్బరి రైతును గ్యానోడెర్మా తెగులు కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ఈ తెగులు సోకిందా ఇక అంతేమరి. ఎకరాలకు ఎకరాల్లో కొబ్బరి చెట్లు చెట్లు చనిపోతుండడంతో తోటలు ఖాళీ అవుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా రైతులు జీడి పంట వైపు చూస్తున్నారు. దీంతో మండలంలో క్రమేపీ జీడి పంట విస్తీర్ణం పెరుగుతోంది.

ప్రజాశక్తి- కవిటి

కొబ్బరి తోటలను ఆశించే తెగుళ్లలో గానోడెర్మా తెగులు ప్రమాదకరమైంది. దీన్ని సిగతెగులు, ఎర్రలక్క తెగులు, బంకకారు తెగులు, పొట్టులక్క తెగులు అని కూడా పిలుస్తారు. ఈ తెగులు నల్ల నేలలు కంటే తేలిక నేలల్లో వేసే కొబ్బరి తోటల్లో ఎక్కువగా కనబడుతుంది. వ్యాప్తి కూడా తేలిక నేలల్లో ఎక్కువగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువగా ఉంటే వ్యాధి వ్యాప్తి తక్కువగా ఉంటుంది. ఈ తెగులు తీవ్రత, తెగులు వ్యాప్తి నీటి ఎద్దడి అధికంగా ఉండే తోటల్లో ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా రైతులు, కొబ్బరి చెట్ల వేర్లను నరికి వేయడం చేస్తూ ఉంటారు. అలా చేయకూడదు. కొబ్బరి వేర్లు నరికి వేయడం వల్ల వేర్లకు గాయం ఏర్పడి నేలలో ఉండే గానోడెర్మా తెగులు కలుగచేసే శిలీంధ్ర బీజాలు గాయమైన వేర్ల ద్వారా చెట్లను ఆశించడం జరుగుతుంది.

గానో డెర్మా తెగులు లక్షణాలు

గానోడెర్మా తెగులు నేలలో ఉండి బూజు జాతి శిలీంధ్ర బీజాల వల్ల కొబ్బరికి సోకుతుంది. గానోడెర్మా తెగులు తీ్మవత భూమిలో నుంచే వేర్లను ఆశిస్తుంది. ఈ దశలో తెగులును గమనించకపోతే అధిక శాతం వేర్లు కుళ్లిన తరువాత కాండంలోకి వ్యాపించి కణాలు పూర్తిగా కుళ్లేలా చేస్తుంది. అయితే ఈ కుళ్లు భూమిలోను, కాండంలోనూ అంతర్గతమవడం వల్ల బయటకు కనిపించదు. ఈ దశలో కాండం మొదలు చుట్టూ ఉన్న చిన్న చిన్న పగుళ్ల నుంచి ముదురు గోధుమ రంగు నుంచి తెలుపు వర్ణం కలిగిన చిక్కటి జిగురు వంటి ద్రవం కారడం గమనించవచ్చు. కాండంలోని కణ సముదాయం పూర్తిగా కుళ్లిపోవడం వల్ల చెట్టు తనకు అవసరమైన నీరు, పోషక లవణాలను భూమి నుంచి తీసుకోలేకపోతుంది. ఈ దశలో కాండం మొదలు చుట్టూ ముందుగా చిన్న చిన్న పగుళ్ల ద్వారా జిగురు కారుతుంది. ఈ బంక కారడం క్రమేణా పైకి వ్యావించి తెగులు సోకిన చెట్లు, ఆకులు పసువు వర్జానికి మారి వడలిపోయి గోధుమ వర్ణానికి మారతాయి. కొత్త అకులు ఆలస్యంగా రావడం వల్ల తెగులు సోకిన చెట్టుపై అకుల సంఖ్య తక్కువగా ఉండడం గమనించవచ్చు. అదే విధంగా ఆకుపరిమాణం కూడా తగ్గిపోతుంది. తెగులు సోకిన కొబ్బరి మొక్కల్లో పుష్పాల సంఖ్య బాగా తగ్గిపోవడమే కాకుండా మగ పుష్పాల సంఖ్య పెరిగి ఆడపుష్పాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. పిందెలు, కాయలు రాలడం కూడా ఈ తెగులు లక్షణమే. ఈ తెగులు ఆశించిన కొబ్బరి చెట్టు వేర్లను గమనించినట్లయితే పూర్తిగా కుళ్లిపోయి నలువురంగులో మారడం చూడవచ్చు. తెగులు తీవ్రంగా ఉన్న చెట్లలో సుమారు 70 శాతం వేర్లు కుళ్లిపోయి ఉంటాయి. కొత్త వేర్లు పుట్టవు. ఈ క్రమంలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా తెగులు తీవ్రమై చెట్టు ఆకులు పసుపు వర్ణంలోకి మారి వడలి వేలాడిపోయే దశకు చేరుకుంటాయి. తరువాత మొవ్వ భాగం మొత్తం వడలిపోయి చెట్టు ఎండిపోతుంది. ఆ తరువాత కొబ్బరి ఆకులు పూర్తిగా రాలిపోవడంతో కాండం మొండిగా తయారై చెక్కిన పెన్సిల్ మొన మాదిరిగా చెట్టు కనిపిస్తుంది. తరువాత 5, 6 నెలల్లో చెట్టు చనిపోతుంది. తెగులు సోకి చివరి దశలో ఉన్న చెట్ల మొదళ్లపై పుట్టగొడుగులు మొలుస్తాయి. ఈ గానోడెర్మా తెగులను పుట్టగొడుగులు ఏర్పడే వరకు రానివ్వడం అత్యధిక ప్రమాదకరం. బలమైన గాలులు వీచేటవ్వుడు ఈ గానోడెర్మా తెగులు సోకి చనిపోయిన చెట్టు, అడుగు భాగంలో విరిగి పడిపోవడం కొబ్బరితోటల్లో గమనించవచ్చు. ఈ పడిపోయిన కొబ్బరి దుంగలను గమనించినప్పుడు దుంగ లోపలి భాగం కుళ్లిపోయి గుల్లమాదిరిగా ఉంటుంది.

నివారణ చర్యలు

తోటలో చనిపోయిన, తెగులు ఎక్కువగా సోకిన చెట్లను వేర్లతో సహా పెకలించి తగులబెట్టాలి. లేదంటే చనిపోయిన చెట్ల కాండంపై పుట్టగొడుగులు మొలిచి తెగులు వ్యాప్తిని నిరోధించడం కష్టమవుతుంది. అలాగే కొత్త మొక్కలను నాటేటప్పుడు చెత్త వేసి కాల్చిన గోతుల్లో బాగా చివికిన పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులతో పాటు 50 గ్రా. ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రపు పొడిని కిలో వేపపిండి మిశ్రమంలో నింపి మొక్కను నాటాలి. గానోడెర్మా తెగులు కలిగించే శిలేంద్ర బీజాలు నేలలో ఉండి తెగిన లేక దెబ్బతిన్న వేర్ల ద్వారా చెట్లకు వ్యాపిస్తుంది. కాబట్టి కొబ్బరి చెట్ల వేర్లు నరుకడం, వేర్లు తెగునంత వరకు లోతుగ దుక్కి చేయుట పనికిరాదు. ఎట్టి పరిస్థితుల్లోను చెట్ల వేర్లు నరకకూడదు. ఈ తెగులు ఎక్కువగా తేలిక నేలల్లో వస్తుంది. అందువల్ల ఈ తేలిక నేలల్లో జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పంటలు చిక్కగ పెంచి పూతకు వచ్చే దశలో భూమిలో కలియదున్నాలి. చెట్ల మొదలు చుట్టూ రెండు మీటర్ల వ్యాసార్థం గల వళ్లాలు చేసి, బోదెల ద్వారా ప్రతి చెట్టుకు విడివిడిగా నీరు పెట్టాలి.



గానోడెర్మా సోకిన కొబ్బరి చెట్టు

ఏం చేయాలి?

తోటలో గానోడెర్మా తెగులు లక్షణాలు గమనించిన వెంటనే తెగులు ఉన్న ప్రాంతాన్ని ఒక మీటరు లోతు, 50 సెం.మీ. వెడల్పు గల గోతిని తవ్వి తెగులు సోకిన చెట్ల నుంచి వేరు చేయాలి. ఈ విధంగా చేయడం వల్ల తెగులు సోకిన చెట్ల వేర్ల వద్ద ఉన్న తెగులు కలుగచేసే శిలీంధ్ర బీజాలు ఆరోగ్యవంతమైన చెట్టు దగ్గరికి వెళ్లవు.












రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

(4వ పేజీ తరువాయి)

సాగుతున్నాయన్నారు. పలాస-కాశీబుగ్గ కేటి రోడ్డు విస్తరణ పనులు సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో సుమారు 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పనులు జరుగుతున్న సమయంలో వివిధ కారణాల వల్ల మిగిలిన 10 శాతం పనులు జరగలేదన్నారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో సుమారు 20 పవర్ బోరులు వేశామన్నారు. ఇంకా-పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టిడిపి కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు వైసిపి ప్రభుత్వంలో రూ.వంద కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. పెసరపాడులో సుమారు రూ.65 లక్షలు, అంతరకుడ్డ గ్రామంలో సుమారు రూ.75 లక్షల వ్యయంతో తారు రోడ్లు వేశామని చెప్పారు. రోటరీ నగర్, మొగిలిపాడు, రామకృష్ణ మార్గ్, గౌతమి స్కూల్ రోడ్డు, తాళభద్ర, దత్తాత్రేయ రోడ్డు, ఆంధ్రా బ్యాంకు రోడ్డు, పురుషోత్తపురం రోడ్డు ఇలా 31 వార్డుల్లో సిసి రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టామని తెలిపారు. అధికార పార్టీ వార్డులతో పాటు టిడిపి వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.















నాటక రంగానికే 'నాయక్'

పలాస : నాటక రంగంలో రాణిస్తున్న కుమార్ నాయక్ 1961లో పలాసలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు. సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంలో పట్టభద్రుడై 'జానపదుల జాడ యాడున్నదో' అనే అంశంపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గ్రామ దేవత ఉత్సవాల్లో కాలి అందియలకు మువ్వలు కట్టి 'కోయ డాన్స్' వీధి కార్యక్రమాలు ప్రదర్శించారు. తన 14వ ఏటలో 'చదువురాని సర్పంచ్' లఘునాటికతో కళారంగ ప్రస్థానం ప్రారంభించారు. నటునిగా, దర్శకునిగా, న్యాయ నిర్ణేతగా, సందర్భోచిత రచయితగా... కళామతల్లి సేవలో ఉన్నారు.

నాయక్ నటించిన నాటికలు, నాటకాలు

అన్ సీజన్లో అల్లుడు నీతి నీ స్థానం ఎక్కడ?,. విజన్ 420, కొడుకే పుట్టాలా?, దాడి, లంకె బిందిలో లక్కాయి పిక్క, పిడికిలి, నాటు మందు, జాలరి జంగమయ్య, చిలక జోస్యం, భైరవకోన, జీవితం, కోయదర కొంటె దంపతులు, కంచం కాదంటుంది, సోది సేబుతాను, కొత్త చిగురు, ఉత్తుంగ తరంగం, ట్రీట్మెంట్, చీడపురుగులు, తెలుగు నాటకాలతో పాటు ఒడియా నాటకాలైన బాణహారణం, దుర్ధశ, హిందీ నాటకమైన 'మిలాఖత్' నాటికలను పలు ప్రాంతాల్లో ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు.

'కొబ్బరి పార్కు' ఏర్పాటయ్యేనా?

- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు
- ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

'కొబ్బరి పార్కు' కొన్ని దశాబ్ధాలుగా ఉద్దానం కొబ్బరి రైతును ఊరిస్తున్న అంశం. ఈ అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా అదిగో పార్కు.. ఇదిగో అనుమతులు అంటూ నాయకులు హడావిడి చేస్తున్నారు. అలాగే ఐదేళ్లకోసారి ఎన్నికలూ జరిగి పోతున్నాయి. అధికారాలు మారిపోతున్నాయి. అధికారులు మారిపోతున్నారు. కానీ, ఉద్దానం కొబ్బరి రైతాంగంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న కొబ్బరి రైతుల ఆయువుపట్టు 'కొబ్బరి పార్కు' మాత్రం కలగానే మిగులుతోంది.



కొబ్బరి పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి- కవిటి

జిల్లా వ్యాప్తంగా 53 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కొబ్బరి సాగు చేస్తున్నారు. అందులో ఒక్క కవిటి మండలంలోని సుమారు 23 వేల ఎకరాలకు పైగా కొబ్బరి సాగు జరుగుతోంది. నమ్మకం, నాణ్యతలో ఉద్దానం కొబ్బరికి పెట్టింది పేరు. దీంతో గోదావరి జిల్లాలతో పాటు మిగతా ప్రాంతాల్లో పండిన కొబ్బరి కంటే ఉద్దానం కొబ్బరి ధర అధికంగా ఉంటుంది. అయితే గత కొంతకాలంగా ఉద్దానం కొబ్బరిని తెగుళ్ళు, వ్యాధులు చుట్టుముట్టడం, వ్యవసాయ ఖర్చులు పెరగడం, నిలకడ నిలకడ లేని ధరలతో కొబ్బరి రైతు విలవిలలాడుతున్నాడు. ఎంత కష్టపడినా సరే సరైన ప్రతిఫలం లభించడం లేదనే నిరాశలో ఉన్నాడు. ఓవైపు పెరుగుతున్న ఖర్చులు మరోవైపు తరుగుతున్న ఆదాయాలతో కుటుంబాలు నడపలేక రైతన్న సతమతమవుతున్నాడు. ఇలాంటి సమయంలో తాను పండించిన పంటకు సరైన గిట్టు బాటు, అదనపు ప్రయోజనాలు లభించాలంటే దానికి ప్రభుత్వ సహకారం అవసరమని భావిస్తున్నాడు.

మాటలకే పరిమితం...

ఇటువంటి పరిస్థితుల్లో గత కొన్ని దశాబ్ధాలుగా కొబ్బరి అంశం పలు దఫాలుగా తెరపైకి వచ్చి కనుమరుగవుతోంది. అదిగో అనుమతులు.. ఇదిగో కొబ్బరి పార్కు అంటూ నాయకులు ఊరించడం జరుగుతుందే తప్ప చేతల్లో పనులు జరగడం లేదనేది బహిరంగ సత్యం.

సాంకేతిక కారణాలు సాకుతో...

మరోవైపు కొబ్బరి పార్కు ఏర్పాటుకు సాంకేతిక కారణాలు సాకుగా చూపి మభ్యపెట్టే పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి కవిటి మండలం తీర ప్రాంతానికి దగ్గరగా ఉండడం తరచూ తుపాన్లకు గురవుతోంది. దీంతో మొదటి నుంచి ఈ ప్రాంతంలో ఎకరాకు 80 నుంచి 120 కొబ్బరి చెట్లు నాటే సంప్రదాయం ఉంది. అయితే 2018లో వచ్చిన తితిలీ తుపానుకు సగానికి పైగా చెట్లు పోయాయి.

ప్రస్తుతం అక్కడ కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తే సరిపడే కాయలు ఉత్పత్తి చేసే అవకాశం లేదని బుకాయింపు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు 50 నుంచి 60 కొబ్బరి చెట్లు ఉండాలి. కానీ, ఇక్కడ అంతకు రెట్టింపు సంఖ్యలో ఉంటున్నాయి. మరోవైపు కవిటి మండలంలో చిక్కాఫ్, కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ పేరుతో రెండు సంస్థలు కొబ్బరి రైతుల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నాయి. మండలంలోని కొబ్బరి రైతులందరూ ఈ రెండు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సుమారు 90 శాతం పైగా రైతులు ఈ రెండింటిలో ఏదో ఒక దాంట్లో సభ్యత్వం పొంది ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో కొబ్బరి పార్కు రావాలంటే రైతులు సంఘాలుగా ఏర్పడాలని కొంతమంది ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఉద్యానశాఖ అధీనంలో మండలాల్లోనే కాక జిల్లా వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో కొబ్బరి పంట సాగు చేస్తున్నారు, ఎంతమంది కొబ్బరి రైతులు ఉన్నారు, కొబ్బరిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతమంది ఎంతమంది జీవిస్తున్నారనే అంశాలు పూర్తి డేటాతో సహా ఉన్నాయి. కానీ, ఏదో ఒకటి చెప్పాలి, ఏదోఒక విధంగా ఈ అంశాన్ని దాటవేయాలనే ధోరణికి ఈ సంఘటనే ఉదాహరణ అని పలువురు రైతులు వాపోతున్నారు. నాణ్యమైన, నమ్మకంతో కూడిన పంటను రైతులు అందిస్తున్నప్పుడు ప్రభుత్వాలు ఎందుకు తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికే వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు తమకు అండగా నిలవాలి తప్ప అంగట్లో నిలబెట్టకూడదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొన్ని వేల కుటుంబాలకు ఆసరా కల్పించే కొబ్బరి పార్కు ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరుతున్నారు.

కొబ్బరి పార్కు తప్పనిసరి



ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్దానం ప్రాంతంలో కొన్ని వేల కుటుంబాల మనుగడకు కొబ్బరి ఆధారిత పరిశ్రమలు తప్పనిసరి. అందులో భాగంగానే కొన్ని ఏళ్లుగా కొబ్బరి పార్కు కోసం ఎదురుచూపులు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వెలుగు, డిఆర్డిఎ ఆధ్వర్యాన కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ కొబ్బరి రైతుల ఆర్థిక స్వావలంబనకు చాలావరకు కృషి చేస్తోంది. అదే కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తే రైతుకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది.

- బల్లెడ జయప్రకాష్,
కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం



శిలగాం గ్రామంలో సర్వే నంబరు 110లో ఉన్న 21 ఎకరాల్లో 13 ఎకరాల్లో కొబ్బరి పార్కు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పార్కు ఏర్పాటు కోసం జెకె ఫౌండేషన్ రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా చేసింది. వాస్తవానికి కరోనా ముందే కొబ్బరి పార్కుకు అనుమతులు రావాల్సింది. కానీ, కరోనా రావడం, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలతో పార్కు ఏర్పాటు ఆలస్యమైంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొబ్బరి పార్కు పనులు ప్రారంభిస్తాం.

- పి.మాధవీలత,
ఉద్యానశాఖ అధికారి, కవిటి

కట్టిపడేసే శిల్పకళకు ప్రతిరూపం

ప్రజాశక్తి- మెళియాపుట్టి


భారత దేశంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో మెళియాపుట్టి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఒకటి. 1840లో ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి మహారాజు వీరేంద్ర ప్రతాపరుద్రుడు తన భార్య విష్ణుప్రియ కోరిక మేరకు ఈ ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయంలో కంచుతో తయారు చేయబడిన విగ్రహాలను రాధాగోవిందుడు, చెలికత్తె లలితాంబలుగా యాత్రికులు కొలుస్తారు. పర్లాకిమిడికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్ర తనయ నది తీరాన మెళియాపుట్టిలో ఈ ఆలయ నిర్మాణాన్ని నిర్మించారు. మహారాణి తల్లిదండ్రులు పసుపు, కుంకుమలు నిమ్మిత్తం ఇచ్చిన ఆభరణాలతో పాటు అప్పట్లో రూ.లక్ష వెచ్చించి ఆమె పేరున ఈ ఆలయాన్ని నిర్మించారు. గర్భగుడిలో ప్రతిష్టించిన మూలవిరాట్ విగ్రహాలను బృందావనం నుంచి తప్పించినట్లు ప్రచారంలో ఉంది. కానీ, ఆ విగ్రహాలు ప్రస్తుతం దొంగిలించ బడ్డాయి.

ఆలయం నిర్మించారు ఇలా...

అప్పటిలో ఒడిశా బరంపురానికి చెందిన మతర అనే గ్రామంలోని శిల్పులతో సుమారు 15 ఏళ్ల పాటు ఆలయ నిర్మాణ ప్రక్రియను కొనసాగించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయ నిర్మాణం భారతదేశంలోనే ఒక చెప్పుకోదగ్గ నిర్మించే తీరుగా వీరేంద్ర ప్రతాప రుద్రుడు నిర్మించాడని చెప్పుకోవచ్చు. ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మించారు. తుమ్మ బంకను కలిపి ఏనుగులతో తొక్కించిన మిశ్రమం తయారు చేసి ఆ మిశ్రమాన్ని ఆలయ తయారీకి ఉపయోగించడం వల్ల మరింత శోభ సంతరించుకుంది. విశిష్ట శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన పురాతనమైన ఈ ఆలయం ప్రస్తుతం సరైన ఆదరణ లేక వెలవెలబోతోందనే చెప్పవచ్చు. అలాగే ఆలయ ద్వారంలోని తలుపులు, ఆలయానికి చుట్టుపక్కల ఉన్న భవనాలకు వేయడానికి తలుపుల కోసం మైసూరు నుంచి కర్ర చెక్కలను తెప్పించారు. వందలాది మంది విశ్వబ్రాహ్మణులు ఆరేళ్లపాటు తలుపులను తయారు చేసినట్లు తెలుస్తోంది. ఆలయ చుట్టుపక్కల ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరుకుంది. పర్లాకిమిడికి చెందిన యాత్రికుడు ఇటీవల ఆలయంపైన ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి రంగవల్లికలను అద్దారు. ఏదేమైనా రంగవల్లులతో ఆలయాన్ని సింగారించటంతో మరింత శోభ సంతరించుకుందనే చెప్పాలి. అయినా చుట్టు పక్కల ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండడంతో అభివృద్ధి చేయాల్సింది చాలా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్వహణ ఇలా..

పర్లాకిమిడి రాజవంశస్థులకు రెండో ఎస్టేట్గా ఉన్న మెళియాపుట్టిలో 50 గ్రామాల నుంచి వచ్చే ఫలసాయాన్ని ఆలయ సన్నిధిలోని 30 గదుల్లో నిల్వచేసి అప్పట్లో పనిచేసే 42 మంది అర్చకులు 25 మంది పనివారలకు జీతాలు చెల్లించే వారు. స్వామి వారికి నిత్య ధూప, దీప నైవేద్యాలకు సామంతులకు చెల్లింపులు ఇక్కడ నుంచే జరిపేవారు. ధాన్యపు కారాగారాలతో పాటు గోశాలలో స్వామి వారికి నిత్య పుష్పాలంకరణ నిమిత్తం సంపంగి తోట లు, జామ, మామిడి తోటలు వివిధ రకాల పళ్ల తోటలు ఏర్పాటు చేశారు. వీటితో నిత్యం అంగరంగ వైభవంగా కార్యక్రమాలు చేసేవారు. నేడు ఒక్క అర్చకుడు మాత్రమే పూజలు నిర్వహిస్తున్నారు. సొరంగ మార్గం కూడా తవ్వారు. మెళియాపుట్టి ఆలయం నుంచి పర్లాకిమిడి బృందావన్ ప్యాలెస్గా పిలువబడే పర్లాకిమిడి రాజుల ఉద్యానవనానికి స్వరంగ మార్గం కూడా ఉండేదని, ఇక్కడి నుంచి బంగారు నాణేలు మెళియాపుట్టిలో పండే ఫలసాయం ఇతర వస్తువులు ఆ సొరంగ మార్గం ద్వారా పర్లాకిమిడి రాజుగారి కోటకు చేరవేసినట్లుగా పలువురు చెబుతున్నారు. ఇప్పటికీ ఆ సొరంగ మార్గం ఉన్నట్లుగా చెబుతున్నారు.




వేణుగోపాలస్వామి ఆలయం
(ఇన్సెట్లో) వేణుగోపాలస్వామి విగ్రహం

ఏటా ఘనంగా డోలోత్సవాలు

స్వామివారి డోలోత్సవాలు యేటా ఘనంగా జరుపుకునేవారు. ఇందులో ముఖ్యమైనది మఘా కార్యక్రమం డోలోత్సవాలు ప్రారంభమయ్యే ముందు రోజు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వామివారిని మెళియాపుట్టి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామ శివార్లలో పెద్ద మంట వేసి పూజా కార్యక్రమాలు చేపడతారు. ఈ కార్యక్రమానికి రాజ వంశస్థులు హాజరయ్యేవారు. ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఏటా మార్చి నెలలో ఈ డోలోత్సవాలు చేస్తున్నారు.

ఇటీవల కొన్ని తెలుగు, ఒరియా చలన చిత్రాలను కూడా ఈ ఆలయంలో చిత్రించారు. ఇదే ఆలయం మాదిరిగా నిర్మాణం చేపట్టాలని కొంతమంది కలకత్తా నుంచి వచ్చి ఫొటోల సేకరించారు. ఏదేమైనా దేవాదాయ, ధర్మాదాయ శాఖ వారు ఆలయ అభివృద్ధికి తోడ్పడి, ఆలయం పూర్తిగా శిథిలం కాకముందే అభివృద్ధి పనులు చేయించాలని మండల వాసులు పలువురు కోరుతున్నారు.



ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు

ధనుంజయ మజ్జి
MEO-1 కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా
MEO-1 అసోసియేషన్ ఏపి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్
మరియు సిబ్బంది

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి దినపత్రిక పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ ప్రతి అక్షరం-ప్రజల పక్షం నినాదంతో 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు



నీలాపు ఉపేంద్రరావు
వార్డెన్,
ఎం.ఎస్ పల్లి ప్రభుత్వ బాలురు వసతి గృహం
కంచిలి మండలం, శ్రీకాకుళం జిల్లా

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ప్రజా సమస్యలపై నిరంతరం అక్షర సమరం సాగిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా దినదినాభివృద్ధి చెందుతున్న ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మీ శ్రేయోభిలాషి
గొల్ల కంచిలి

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

"ప్రతి అక్షరం - ప్రజల పక్షం" అంటూ ప్రజల సమస్యలను పత్రికా ముఖంగా తెలియజేస్తూ... నేడు 44వవసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా ఇవే మా హార్దిక శుభాకాంక్షలు...



పి.మాధవి లత
ఉద్యానవన శాఖ అధికారి,
కవిటి, కంచిలి,సోంపేట, ఇచ్ఛాపురం.



సిహెచ్ శంకర్ దాస్
ఉద్యానవన శాఖ అధికారి,
పలాస, మెళియాపుట్టి, మందస, నందిగాం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అక్షర సత్యాలతో - అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



గుజ్జు నారాయణరెడ్డి
క్లాసు-1 కాంట్రాక్టర్, ఇచ్ఛాపురం,
శ్రీకాకుళం జిల్లా

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి దినపత్రిక పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ ప్రతి అక్షరం-ప్రజల పక్షం నినాదంతో 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు



ఎం. నారాయణరావు
వార్డెన్, బాలుర వసతి గృహం
పెద్దకర్రివానిపాలెం, కవిటి మండలం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అక్షర సత్యాలతో.. అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



జి. రామారావు
వార్డెన్ బాలుర వసతి గృహం,
బొరివంక, కవిటి మండలం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి దినపత్రిక 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు

మీ
శ్రేయోభిలాషి
పలాస మండలం.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



'ప్రతి అక్షరం - ప్రజల పక్షం' అనే నినాదంతో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజాశక్తి దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...

టి. శ్రీనివాసరావు
సి.ఇ.ఒ, పి.ఎ.సి.ఎస్, పలాస

కె. భాస్కరరావు
జూనియర్ ఇన్‌స్పెక్టర్
పి.ఐ.సి, పలాస పి.ఎ.సి.ఎస్,
మరియు సిబ్బంది

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి దినపత్రిక 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు



నర్తు నరేంద్ర యాదవ్
అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి
మాజీ డిసిసిబి వైస్‌ప్రెసిడెంట్, బిసి జనసభ కార్యవర్గ సభ్యులు
మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, ఇచ్ఛాపురం.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్
అఖిల భారతీయ యాదవ మహాసభ యువజన అధ్యక్షులు,
శ్రీకాకుళం జిల్లా.

నర్తు వరప్రసాద్
సర్పంచ్,
ఈదుపురం గ్రామ పంచాయితీ

నర్తు శాంతి కుమారి
ఎం.పి.టి.సి,
ఈదుపురం గ్రామ పంచాయితీ

ఈదుపురం గ్రామపంచాయితీ - ఇచ్ఛాపురం మండలం

44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

'ప్రతి అక్షరం - ప్రజల పక్షం' అనే నినాదంతో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజాశక్తి దినపత్రికకు 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...



తాడి ఆదిరెడ్డి
20వ వార్డు కౌన్సిలర్, జిల్లా వై.సి.పి ప్రచారకమిటీ ఛైర్మెన్
ఇచ్ఛాపురం పురపాలక సంఘం.

గ్రామీణ రహదారులు అధ్వానం

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజానీకం

ప్రజాశక్తి- కంచిలి

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్ప గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాస్తా చినుకులు పడితే చాలు రహదారులన్నీ బురదమయమై, గోతుల్లో పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గ్రామాల రూపురేఖలు మార్చేశామంటూ గొప్పలు చెప్పిన గత వైసిపి ప్రభుత్వంలో రహదారుల దుస్థితి ఎలా ఉందో ప్రస్తుతం కొత్త కూటమి ప్రభుత్వ పాలనలో కూడా అలాగే ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈసారైనా తాము గతంలో ఇచ్చిన వాగ్ధానాల నేపథ్యంలో కంచిలి మండలంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధికి చర్యలు తీసు కుంటారన్న ఆశాభావాన్ని గ్రామీణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి మండలం 30 పంచాయతీలతో కూడి ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉంది. కంచిలి మండలంలోని సుమారుగా చాలా పంచాయతీలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు వేసిన రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాకపోకలు సాగడం లేదు. మండల కేంద్రం కంచిలితో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాలే కాకుండా మండల శివారు గ్రామాల్లో సరైన రహదారులు లేక నిత్యం వాహన చోదకులు, పాదచారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కంచిలి పంచాయతీలో అంతర్గత రహదారులు సరిగా లేవు. బలియాపుట్టుగ కాలనీ, భగవతికాలనీ తదితర ప్రాంతాల్లో సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో చినుకుపడితే వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహిస్తు, అనంతరం రాళ్లు తేలి భయానకంగా మారుతున్నాయి. జాతీయ రహదారి నుంచి వెళ్లే అంపురం రహదారి, ఘాటి ముకుందపురం రోడ్డు, కత్తివరం రహదారి, పెద్దశ్రీరాంపురం రోడ్డు ఇలా అన్ని రహదారులు రాళ్లు తేలి ప్రయాణాలకు ఇబ్బందులుగా మారాయి. తరచూ ఘాటి రోడ్డులో ఆర్‌టిసి బస్సులు అదుపు తప్పి ప్రమాదాలు సైతం జరగడం నిత్యకృత్యంగా మారింది. అలాగే డిజిపురం రహదారి, భైరిపురం-ఘాటి రహదారి, ఎంఎస్‌పల్లి నుంచి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారితో పాటు దాలేశ్వరం వెళ్లే దారి గోతులమ యంగా మారింది. ఇదే కాకుండా జలంత్ర కోట పంచా యతీలోని గోకర్ణ పురం, నారాయణ పురం, మధుపురం, ఉప్పరిపేట తదితర రహదారులు సైతం గోతులమయంగా మారాయి. ఉత్తమ మండపల్లి పంచా యతీలోని మండపల్లి, అమ్మవారిపుట్టుగలకు వెళ్లే రహదారి మొత్తం గోతులమయమైంది. కుత్తుమ పంచాయతీలో రహదారి పరిస్థితి అధ్వాన్నమే. ఇలా మండలంలోని అన్ని గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారాయి. ఇప్పటికైనా అటు అధికారులు, ఇటు పాలకులు స్పందించి గ్రామీణ రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.


బురదమయంగా మారిన ఎంఎస్ పల్లి నుంచి దాలేశ్వరం వెళ్లే రహదారి


గోతులమయంగా మారిన డిజిపురం-ఘాటి రహదారి

నిధులు మంజూరయ్యాయంటున్న పాలకులు

మండలంలో గ్రామీణ రహదారుల పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే పాలకులు మాత్రం ఇదిగో నిధులు మంజూరై పోయా యంటూ ప్రకటనలు ఇస్తున్నారే తప్ప, పనులు మాత్రం ఎక్కడా ప్రారంభిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రజలను మభ్యపెట్టేందుకే ఈ ప్రకటనలు చేస్తున్నారంటు పలు వ్యాఖ్యా నాలు వినిపిస్తున్నాయి. మండల శివారు పంచాయతీల్లో రహదారుల దుస్థితి ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పాలకులు రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.

ఇబ్బందులను పట్టించుకోని అధికారులు

మండలంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా రాళ్లు తేలి భయానకంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు ప్రతిపాదనలకు పరిమితమవుతుంటే, నిధులు మంజూరైతేనే పనులు చేస్తాం, అంతకుమించి మాకేమి పట్టనట్టు అధికారులు వ్యవహరి స్తుండటంపై గ్రామాల్లో అసంతృప్తి వ్యక్తమ వుతుంది. రహదారులు బాగోలేక ఎక్కడైనా వాహన ప్రమాదాలు జరిగితే వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటనలు ఇవ్వడం, ఇదిగో నిధులు మంజూరంటూ చెప్పడమే జరుగుతుంది తప్ప, నిజంగా గ్రామీణ రహదారులపై ఎవ్వరికీ చిత్తశుద్ధి లేదని పలువురు పేర్కొంటున్నారు.

పంచాయతీలకు అదనపు భారం

- భారంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- జిల్లాలో 678కి పైగా కేంద్రాల ఏర్పాటు
- ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.6 లక్షల నుంచి 8 లక్షల ఖర్చు
- ఆదాయాన్ని సమకూర్చిన దాఖలాలు శూన్యం


పెద్ద కొజ్జిరియాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి- కంచిలి

గ్రామ పంచాయితీలకు ఆదాయం వచ్చే మార్గాల అన్వేషణలో భాగంగా ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చర్యలు చేపట్టింది. అయితే వాస్తవంలోకి వచ్చేసరికి ఈ కేంద్రాల ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించినా క్షేత్రస్థాయిలో ఒక్క పంచాయతీలో కూడా ఈ కేంద్రాల నిర్వహణ ద్వారా వందల రూపాయల్లో కూడా ఆదాయం సమకూరని దుస్థితి నెలకొంది. పంచాయ తీలకు ఆదాయం సమకూరకపోగా వీటి నిర్వహణ పంచాయతీలకు అదనపు భారంగా మారింది. జిల్లాలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల స్థితిగతులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకానికి అను సంధానంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆయా పంచాయతీల్లో స్థలాలు కేటాయించి, ఒక్కో కేంద్రం నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు 6 నుంచి 8 లక్షల రూపాయల నిధులు వెచ్చించి కేంద్రాల నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు 80 శాతానికిపైగా షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణ దశల్లో ఉండగా, మరికొన్ని చోట్ల స్థల సేకరణలు పూర్తిచేశారు. అయితే పూర్తయిన కేంద్రాలు పనిచేయాలంటే ప్రతి పంచాయతీల పరిధిలోని ఇళ్ల నుంచి తడి చెత్తను సేకరించి, కేంద్రాలకు అందించాలి. ఇక్కడే నిర్వహణ లోపం కారణంగా ఇప్పటివరకు ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల లక్ష్యం నీరుగారి పోయింది. ఇప్పటికైనా అధికారులు సమస్యలు పరిష్కరించి, కేంద్రాల ఏర్పాటు లక్ష్యాలను సాధించి, పంచాయతీలకు భారంగా కాకుండా ఆదాయాన్ని సమకూర్చేలా మార్చాలని సర్వత్రా కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 678 కేంద్రాలు ఏర్పాటు

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతి మండలంలో పెద్ద పంచాయతీల్లో ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణకు గత వైసిపి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయక పోవడంతో పూర్తిగా నిర్వీర్యమై పోయాయి. కంచిలి మండలంలో 20 పంచాయతీల్లో కేంద్రాలు పూర్తికాగా 11 నిర్మాణ దశలో ఉన్నాయి. ఇచ్ఛాపురంలో 21 కేంద్రాలకు గాను 15, సోంపేటలో 23 పంచాయతీలకు గాను 22, కవిటి మండలంలో 23 పంచాయతీలకు గాను 13, పలాస సబ్ డివిజన్ పరిధిలో 232 కుగాను 177 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తి జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 678 కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటి నిర్వహణ వలన పంచాయతీలకు ఎటువంటి ఆదాయం రావడం లేదు.

గ్రీన్ అంబాసిడర్లకు అందని వేతనాలు

ఈ కేంద్రాల నిర్వహణకు అవసరమైన ముడి పదార్ధాన్ని సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను ప్రభుత్వం నియ మించింది. వీరు గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి ఈ కేంద్రాలకు తరలించాలి. అయితే చాలాచోట్ల తడి చెత్తను సేకరిస్తున్న చర్యలే లేవు. చాలామంది పొడి చెత్తను మాత్రమే సేకరించి, కేంద్రాల్లో పోస్తున్నారు. అయితే ఈ కేంద్రాల్లో తడి చెత్తను ఉపయోగించి మాత్రమే కంపోస్టు ఎరువు తయారు చేసి, దాన్ని విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్రాల నిర్వహణే కష్టంగా ఉందని ఉద్యోగులు చెబుతున్నారు.

చరిత్రగా మిగిలిన 'కంచిలి కొబ్బరి మార్కెట్'

- కొబ్బరికి చిరునామాగా ఉన్న స్థితి నుంచి ఉనికి కోల్పోయిన వైనం
- కొబ్బరిపై ఆధారపడ్డ కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరం
- ఉన్న కొద్దిమంది సైతం హక్కులకు నోచని వైనం



కంచిలిలోని ఒక కొట్టులో ఎండలో కొబ్బరికాయల తీత చేపడుతున్న కొబ్బరి కార్మికులు

ప్రజాశక్తి- కంచిలి

కొబ్బరి పంట అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతం అయితే... కొబ్బరి వ్యాపారం అంటే మాత్రం టక్కున గుర్తొచ్చేది కంచిలి గ్రామం. అంతగా కొబ్బరి వ్యాపారానికి పేరు గాంచింది కంచిలి. పాత జాతీయ రహదారికి ఆనుకుని అడుగడుగునా కనిపించే కొబ్బరి బడ్డీలు, టోకు వర్తకుల హడావుడి, నిత్యం ఎగుమతులు, దిగుమతులు చేస్తు రాకపోకలు సాగించే కొబ్బరి లారీలతో కంచిలి మండలం కేంద్రం కళకళలాడుతూ ఉండేది. అయితే ఉద్దానాన్ని వణికించిన వరుస తుపానులు, కొబ్బరి పంటకు ఆశించిన తెగుళ్లు కొబ్బరి పంటను నాశనం చేయడంతో ఆ ప్రభావం కంచిలి కొబ్బరి మార్కెట్‌పై పడి, ప్రస్తుతం కళావిహీనంగా మారి తన ఉనికినే కోల్పోయిన దుస్థితికి చేరుకుంది. అయితే ఏళ్ల తరబడి కొబ్బరి బడ్డీలను, కొబ్బరి పనులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కొబ్బరి కార్మికులు మాత్రం స్థానికంగా ఉపాధి లేక, ఆ పనులను విడిచి పెట్టలేక, తక్కువ వేతనాలకే పనులు చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. అయితే చాలా మంది ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను ఇక్కడే విడిచిపెట్టి, అహ్మదాబాద్, బెంగుళూరు, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు. అయితే ఏళ్ల తరబడి కొబ్బరి కార్మికులుగా తమ జీవనం వెళ్లదీస్తున్న వారికి సైతం యజమాన్యాలు సరైన వేతనాలు చెల్లించక, పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించక పోతుండటంతో కొబ్బరి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి కార్మికుల్లో ఉన్న నిరక్షరాస్యత, అవగాహనా లేమి కారణంగా కూడా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, కార్మిక చట్టాల ద్వారా సంక్రమించే హక్కులు అందకుండా పోతున్నాయనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కార్మికుల్లో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన సంబంధిత అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, చట్టాలను చుట్టుబండలు చేస్తున్న యజమానులకే కొమ్ముకాస్తుండటం కార్మికుల ఇబ్బందులను మరింత రెట్టింపు చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. తమ హక్కుల సాధన కోసం స్థానిక కొబ్బరి కార్మికులు యూనియన్‌గా ఏర్పడి తమ పోరాటం కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి పోరాటాలు సాగిస్తున్నా ఆశించిన హక్కులు సాధనలో పూర్తిస్థాయిలో విజయవంతం కాలేకపోతున్నామని, దీనికి పాలకులు, అధికారుల ఉదాశీనత కూడా కారణమని కార్మిక సంఘ నాయకులు, కార్మికులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలు స్పందించి తమకు చెల్లించాల్సిన న్యాయమైన వేతనాలను చెల్లించడమే కాకుండా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పించాలని వారంతా కోరుతున్నారు. అప్పటి వరకు తాము పోరుబాట విడిచేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు.

కొబ్బరి కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరం

ఒకప్పుడు కంచిలి కొబ్బరి మార్కెట్‌లో కొబ్బరి కార్మికుడిగా పనిచేస్తున్నారంటే ఉన్నతంగా భావించిన పరిస్థితి నుంచి నేడు కొబ్బరి కార్మికులు తమ ఉనికినే కోల్పోయిన పరిస్థితులు నెలకొన్నాయి. పూర్తిగా కంచిలి కొబ్బరి మార్కెట్ పడి పోవడం, స్థానిక వ్యాపారులు సైతం తమ వ్యాపారాలను విస్తరించకపోగా, ఇతర వ్యాపారాల వైపు దృష్టి సారిస్తుండటంతో కొబ్బరి కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అయితే ఇటువంటి పరిస్థితుల్లోను కంచిలికి చెందిన కొబ్బరి కార్మికులంతా కలిసి తమ హక్కుల సాధన కోసం శ్రీ కంచమ్మ తల్లి కొబ్బరి కార్మికుల సంక్షేమ సంఘంగా ఏర్పడ్డారు. ఈ సంఘం ఆధ్వర్యంలో సిఐటియు అనుబంధంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతిఏటా తమ యాజమాన్యంతో వేతన ఒప్పందం చేసు కుంటుంటారు. పెరుగుతున్న ఆర్థిక అవసరాలు, ఇతరత్రా అంశాలను పరిగణలోకి తీసుకుని వేతన ఒప్పందాలను అమలు చేస్తుంటారు. అయితే కొద్ది సంవత్సరాలుగా వేతన ఒప్పంద ప్రక్రియ సజావుగా జరగడం లేదు. తమ వ్యాపారాలు ముందులా జరగడం లేదని, నష్టాలు వస్తున్నాయంటూ యాజ మాన్యాలు వేతన సవరణలకు అంగీకరించక పోవడంతో కార్మికులు ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో తమకు న్యాయం జరపాలని, కార్మిక చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాలని, చట్టాలకు లోబడి పనిచేసే చోట కార్మికులందరికీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్‌లను యాజమాన్యాల ముందు కార్మికులు ఉంచుతున్నారు.

సౌకర్యాల కల్పన అంతంతే

కొబ్బరి షాపుల వద్ద కార్మికులు పని చేసే ప్రదేశాలలో యాజమాన్యం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు కార్మికులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు కొబ్బరి కాయలు పీచు తీసే ప్రదేశాల వద్ద ఎటువంటి షెడ్లు నిర్మించకపోవడంతో ఎండలోనే కాయలు వలుస్తున్నారు. అలాగే మహిళా కార్మికులు పని చేసే చోట మరుగుదొడ్ల సదుపాయం, తాగునీటి సదుపాయాలు కనిపించక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసే చోట అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే కార్మికులకు ప్రథమ చికిత్స జరిపేందుకు సైతం అందుబాటులో ఎక్కడా ప్రథమచికిత్స పెట్టెలను ఏర్పాటు చేయలేదు. దీంతో ఎండైనా, వానైనా పని చేస్తు, చట్టాలు కల్పిస్తున్న తమ హక్కులను సైతం పొందలేని దుర్భర పరిస్థితుల్లో కొబ్బరి కార్మికులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

తాము పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకునే నాధుడే లేడన్న వ్యాఖ్యానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కార్మికులు పని చేసే చోట ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవిస్తే అటు ప్రభుత్వం నుంచి అందే పరిహారం, ఇతర బీమా వంటి విషయాల్లో చాలామంది కార్మికులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. దీనికి కారణం చాలా మంది కొబ్బరి యాజమానులు తమ వద్ద పని చేస్తున్న కొబ్బరి కార్మికులను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయించకపోవడమే. కార్మికుడిగా నమోదు చేసిన ప్రతి ఒక్కరికీ సంస్థ తరుపున కొంత మొత్తం చెల్లించాల్సి ఉండగా, వాటిని యాజమాన్యాలు పట్టించుకోక, నామమాత్రంగా పేర్లు నమోదు చేస్తుండటం జరుగుతోంది. దీంతో కొన్నిసార్లు ప్రమాదం జరిగి కార్మికుడు మృతి చెందినా పరిహారం అందే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. దీంతో ఆ కార్మికుడి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అలాగే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై సైతం సరైన అవగాహన లేమి కారణంగా వారు ఆ సౌకర్యాలను వినియో గించుకోలేక పోతున్నారు. రోజుకి 8 గంటలు మాత్రమే పని చేయాల్సి ఉన్నప్పటికీ 10 గంటలకు పైగా పనులు చేయాల్సి వస్తుందని పలువురు కార్మికులు వాపోతున్నారు. మహిళా కార్మికులు సైతం కార్మిక చట్టాలు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలకు దూరంగానే ఉండిపోతున్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసేలా పరిరక్షించాల్సి ఆ శాఖాధికారులు సైతం నామమాత్రపు తనిఖీలు చేస్తు యాజమాన్యాలకే కొమ్ముకాస్తుండటంతో కార్మికుల పరిస్థితులు దుర్భరంగానే మిగులుతున్నాయి.

కళాశాలలో సమస్యల తిష్ట



అభివృద్ధికి నోచుకోని కంచిలి ప్రభుత్వ కళాశాల

- వేధిస్తున్న వసతి సమస్య
- సైన్సు విద్యార్థులకు తప్పని ల్యాబ్ ఇక్కట్లు
- ప్రభుత్వాలు మారినా మారని దుస్థితి

ప్రజాశక్తి- కంచిలి

ప్రభుత్వ విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామంటూ పాలకులు చెబుతున్న మాటలకు ఆచరణలో వారు చూపిస్తున్న చిత్తశు ద్ధికి పొంతన ఉండదన్న మాటలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుర్కొంటున్న దుస్థితి. ఉన్న గదులు విద్యాబోధనకు చాలకపోగా, సరైన సౌకర్యాలు కల్పనకు నోచుకోక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన వైనంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 230 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా తెలుగు, ఇంగ్లీష్, ఒరియా మాధ్యమాల్లో నాలుగు గ్రూపులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల బోధనకు సరిపడ తరగతి గదులు లేకపోగా, ఉన్న గదుల్లో వారికి బోధనతో పాటు సైన్స్ విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇపుడు ఉన్న భవనంలో కేవలం ఎనిమిది గదులు మాత్రమే ఉండటంతో ఒక గదిని ఆఫీస్ కార్యకలాపాలకు, ప్రిన్సిపాల్ రూమ్‌గా వాడుక చేస్తుండగా, ఇంకొక గదిని సైన్స్ ల్యాబ్‌గా ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదుల్లోనే అందరు విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం అదనపు గదుల నిర్మాణానికి పునాదులు వేసినా, సంవత్సరాలుగా అది పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనాలు చేసేందుకు విద్యార్థులు సమీపంలోని చెట్ల నీడలకు, పక్కవీధిలో ఇళ్ల వద్దకు చేరి ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిరుపేద విద్యార్థులు ఎక్కువశాతం చదివే కంచిలి ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.



అదనపు భవనాల కోసం వేసిన పునాదులు

కంచిలి కళాశాలే శరణ్యం

మండల కేంద్రంతో పాటు మండల శివార్లలోని జలంత్రకోట, జె మాణిక్యపురం, ముండల, ఎక్కల, అర్జునాపురం, ఘాటి, రేఖాదేవిపురం, జిల్లుండ గ్రామాలతో పాటు కవిటి మండలంలోని బైరాగిపుట్టుగ, మెళియా పుట్టుగ, కొన్నాయిపుట్టుగ, జమే దారుపుట్టుగ, బెలగాం, సహలాలపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులంతా కంచిలి ప్రభుత్వ కళాశాలలోనే విద్యాభ్యాసం చేస్తుంటారు. ప్రైవేటు కళాశాలల్లో చదివించ ేందుకు ఆర్థిక స్తోమత లేక, అనేక ఇబ్బందులు పడుతూ వచ్చే విద్యార్థులకు కళాశాలలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

అధ్యాపకులు అరకొరే

ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 120 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 110 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా వీరికి తరగతులు బోధించేందుకు పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరు. 15 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా మరో 10 మంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు.

అలాగే కళాశాలలో బోధనేతర కార్యకలాపాలు సాగించేందుకు నలుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరే ఉన్నారు. దీనికితోడు కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో తరగతులు జరుగుతుండగా పశువులు, కుక్కలు కళాశాలలోనికి రావడమే కాకుండా, వాహన చోదకులు సైతం ఇదే దారి నుంచి జాతీయ రహదారికి వెళ్తుండడంతో విద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పడమే తప్ప, కళాశాల అభివృద్ధికి ఎవరూ ఏమి చేసిందేమి లేదన్న విమర్శలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి.





అభివృద్ధి పథంలో పలాస

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నీటిని శివారు ప్రాంతమైన వజ్రపుకొత్తూరు వరకు అందించామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే నీటిని శివారు ప్రాంతాలకు అందించామని చెప్పారు. పంట చివరి వరకు వంశధార నీటిని శివారు ప్రాంతాలకు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు హయాంలో వంశధార నీటిని శివారు భూములకు అందించలేక పోయారన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేసి పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. ఇప్పటికే ఆఫ్‌షోర్ రిజర్వాయరుపై తనతో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులతో సమీక్షించారని చెప్పారు. త్వరలో పనులు ముమ్మరంగా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సమస్యపై ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. నీటిని మళ్లించేందుకు అయ్యే ఖర్చుకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. కాశీబుగ్గ రైల్వే వంతెన ఎన్నో ఏళ్ల నుంచి అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయని, మాజీ మంత్రి అప్పలరాజు మా హయాంలో పూర్తి చేస్తామని చెప్పి రెండో సారి శంకుస్థాపన చేశారే తప్ప పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం హయాంలో రైల్వే వంతెన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. జీడి రైతులకు అండగా ఉండేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా జీడి బోర్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో జీడి పిక్కల బస్తా రూ.7 వేలు ధర పలుకగా, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బస్తా రూ.14 వేలు ధర పలికిందని చెప్పారు. అటు రైతులకు ఇటు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు వ్యవసాయ ఆధారిత చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మందస మండలంలోని దామోదరసాగర్, కళింగదళ్, సొంకు జోడి తదితర సాగునీటి ప్రాజెక్టులకు ఆధునికీకరణ పనులు చేపట్టి ప్రతి సెంటుకూ సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.